## మొదటి పేజి తరువాయి

## తిరుపతి ఘటనపై హోంమంత్రి అనిత సీరియస్..

## దర్యాప్తు కోసం ఒడిశాకు ప్రత్యేక బృందం

అమరావతి : తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. ఈ కేసు దర్యాప్తు పురోగతిపై తిరుపతి ఎస్పీ, ఇతర పోలీసు ఉన్నతాధికారులతో ఆమె ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనలో నిందితులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని హోంమంత్రి తెలిపారు. తిరుపతి ఎస్పీ స్వయంగా ఈ కేసును పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రాథమిక దర్యాప్తులో భాగంగా సాక్ష్యాధారాలు, ఇతర కీలక సమాచారం సేకరించేందుకు ఒక ప్రత్యేక పోలీసు బృందాన్ని ఒడిశాకు పంపినట్లు అనిత వెల్లడించారు. బాధితురాలికి న్యాయం చేయడమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని మంత్రి అనిత పునరుద్ఘాటించారు. మహిళల భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఇలాంటి దారుణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఆమె హెచ్చరించారు. ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసి, బాధితురాలికి త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని పోలీసు అధికారులను హోంమంత్రి ఆదేశించారు.

## ఇండిగో ప్రయాణికులకు రూ.827 కోట్ల రిఫండ్

డిసెంబూర్ 1 వరకు 9,55,591 టిక్కెట్లు రద్దయినట్లు పౌర విమానయాన శాఖ తెలిపింది. వీటి విలువలో రూ.827 కోట్లు రిఫండ్ చేసినట్లు పేర్కొంది. డిసెంబర్ 1 నుంచి 7 వరకు 5,86,705 టిక్కెట్లు రద్దు కాగా, రూ.570 కోట్లు ప్రయాణికులకు అందినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. విమానాల సర్వీసుల రద్దు వల్ల వివిధ విమానాశ్రయాల్లో దాదాపు 9,000 బ్యాకేజీలు నిలిచిపోయినట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వాటిలో 4,500 బ్యాగులను ఇప్పటికే ప్రయాణికులకు అందజేసినట్లు తెలిపింది. వచ్చే 36 గంటల్లో మిగిలిన వాటిని డెలివరీ చేసేందుకు ఇండిగో ఏర్పాటు చేస్తోంది. సోమవారం మొత్తం 500 సర్వీసులు రద్దయ్యాయని వెల్లడించింది. ఇదిలా ఉండగా, సర్వీసుల పునరుద్ధరణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు తమ మాతృసంస్థ ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్ ప్రత్యేకంగా ఒక క్రైసిస్ మేనేజ్‌మెంట్ గ్రూప్‌ను ఏర్పాటు చేసినట్లు ఇండిగో తెలిపింది. డిసెంబర్ 4న జరిగిన బోర్డు సమావేశంలో దీని ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ..

## రూ.3 కోట్ల రివార్డున్న కమాండర్ లొంగుబాటు

రూ.3 కోట్ల రివార్డు ఉన్న కీలక నేత రాంధేర్ కూడా ఉండటం గమనార్హం. రాంధేర్ చాలాకాలంగా ఎంఎంసీ (మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్) జోన్‌లో అత్యంత క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. గతంలో మిలింద్ తెల్టుంబే మరణించిన తర్వాత ఆయన ఎంఎంసీ బాధ్యతలను స్వీకరించారు. ఈ జోన్‌లో పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్న రాంధేర్ లొంగుబాటును పోలీసులు కీలక విజయంగా పరిగణిస్తున్నారు. తాజాగా రాంధేర్ లొంగుబాటుతో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలు దాదాపుగా నక్సల్స్ రహితంగా మారాయని అధికారులు భావిస్తున్నారు. ఇది భద్రతా బలగాలకు వ్యూహాత్మకంగా ఎంతో మేలు చేస్తుందని విశ్లేషిస్తున్నారు. ఇటీవలి కాలంలో వివిధ రాష్ట్రాల్లో మావోయిస్టులు పెద్ద సంఖ్యలో లొంగిపోతున్న విషయం తెలిసిందే.

## తాగుబోతుల తెలంగాణ’గా

## మార్చేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు మొండి చేయి చూపిందని, పాలన పూర్తిగా ఆగమాగంగా ఉందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. పూర్తిస్థాయి రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే తాను రాజీనామాకు సిద్ధమని... నిరూపించలేకపోతే రాజీనామాకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమా? అని సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రెండేళ్ల పాలన అనేది ప్రభుత్వ పనితీరుకు గీటురాయిలాంటిదని, కానీ ఈ ప్రభుత్వం నిస్సారంగా, నిరర్థకంగా మిగిలిపోయిందని హరీశ్ రావు దుయ్యబట్టారు. “ఈ రెండేళ్లలో ఆత్మస్తుతి, పరనింద తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదు. మా ప్రభుత్వం రాగానే మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలు తెచ్చాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రజా దర్బార్ కూడా ఇప్పుడు అమలు కావడం లేదు. కేసీఆర్ తెచ్చిన మెట్రో రైలు, ఫార్మా సిటీ వంటి కీలక ప్రాజెక్టులను రద్దు చేయడం మినహా వీరేమీ చేయలేదు” అని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆదాయం కూడా పూర్తిగా తగ్గిపోయిందని ఆరోపించారు. రైతుల సమస్యలపై హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. “మక్కలు కొని 50 రోజులు దాటినా రైతులకు ఇంకా డబ్బులు ఇవ్వలేదు. రైతులకు బేడీలు వేసిన ఈ ప్రభుత్వం రైతు సంక్షోభ ప్రభుత్వం. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా మద్యం దుకాణాలకు నోటిఫికేషన్లు ఇచ్చి రాష్ట్రాన్ని ‘తాగుబోతుల తెలంగాణ’గా మార్చేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు” అని విమర్శించారు. ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు అడిగితే విజిలెన్స్, ఏసీబీ దాడులు చేయిస్తోందని ఆరోపించారు. గ్లోబల్ సమ్మిట్‌ను “గోబెల్స్ సమ్మిట్” అని ఎద్దేవా చేశారు. “గతంలో దావోస్ వెళ్లి డొల్ల కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని రేవంత్ నవ్వులపాలయ్యారు. ఇప్పుడు గ్లోబల్ సమ్మిట్ జరుగుతున్న భూమి, ఫార్మా సిటీ కోసం సేకరించిన 13 వేల ఎకరాల భూమి బీఆర్ఎస్ హయాంలో సమీకరించినదే. అందులో రేవంత్ చెమట చుక్క కూడా లేదు” అని అన్నారు. కేసీఆర్ యువత ఉద్యోగాల కోసం ఆలోచిస్తే, రేవంత్ ఆ భూములను తన అనుయాయులకు పంచిపెడుతున్నారని ఆరోపించారు. రెండో ఏడాది పాలన “పెనంలోంచి పొయ్యిలో పడినట్లు ఉంది” అని, మూడో ఏడాది ఏమవుతుందో చూడాలని వ్యాఖ్యానించారు.

## బెంగళూరు తర్వాత ఐటీ ఎగుమతుల్లో

## తెలంగాణ గణనీయ వాటాను కలిగి ఉంది

ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్ తరానికి ఏం కావాలో తెలంగాణ ప్రభుత్వం ఆలోచన చేసిందని ఆయన ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్రం, దక్షిణ భారతదేశ అభివృద్ధికి కర్ణాటక సహకరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ రాష్ట్రం కూడా గణనీయమైన వాటాను కలిగి ఉందని అన్నారు. కాలిఫోర్నియా వంటి ప్రపంచస్థాయి నగరాల్లో 13 లక్షల మంది భారతీయ ఇంజినీర్లు పనిచేస్తున్నారని ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రిగా రెండేళ్లు పూర్తి చేసుకున్న రేవంత్ రెడ్డికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి మరింత దృఢంగా నిలదొక్కుకోవాలన్న ఉద్దేశంతో తాను ఈ సదస్సుకు వచ్చానని ఆయన పేర్కొన్నారు.

## చైనాలోని ఆ ప్రావిన్స్ ను స్ఫూర్తిగా తీసుకున్నాం

చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రం ముందుకు సాగుతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గ్వాంగ్‌డాంగ్ రెండు దశాబ్దాల్లోనే అత్యధిక పెట్టుబడులు సాధించిందని తెలిపారు. ‘తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025’లో ఆయన మాట్లాడుతూ, కొత్త రాష్ట్రమైనప్పటికీ తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు. 2047 నాటికి సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నామని అన్నారు. తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనేది తమ ఆశయమని అన్నారు. పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల నుంచి ఆలోచనలను, అభిప్రాయాలను స్వాగతిస్తున్నామని ఆయన అన్నారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని, దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతంగా ఉండాలనేది తమ ఆశయమని అన్నారు. లక్ష్యం పెద్దది అయినప్పటికీ కష్టపడితే అసాధ్యమేమీ కాదని అన్నారు. అందరి సహకారంతో లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ నేతృత్వంలో తెలంగాణ కల సాకారమైందని ముఖ్యమంత్రి అన్నారు. దేశంలోనే తెలంగాణ కొత్త రాష్ట్రమని, దేశ జనాభాలో 2.9 శాతమే ఉన్నప్పటికీ, 5 శాతం ఆదాయం ఇస్తున్నామని అన్నారు. ఏ రాష్ట్రం చేయని విధంగా రాష్ట్రాన్ని 3 జోన్లుగా విభజించామని అన్నారు. వాటిని సేవ, తయారీ, వ్యవసాయ రంగాలకు కేటాయించామని అన్నారు. క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా పిలుచుకుంటున్నామని అన్నారు. చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్ స్ఫూర్తిగా ముందుకు వెళుతున్నామని అన్నారు. అది 20 ఏళ్లలోనే అత్యధిక పెట్టుబడులు సాధించిందని వెల్లడించారు. ఇక్కడ కూడా గ్వాంగ్‌డాంగ్ నమూనాను అమలు చేయదలిచామని అన్నారు. చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ దేశాలు మాకు ఆదర్శమని అన్నారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు వెళుతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. వచ్చే పదేళ్లలో తెలంగాణను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా, ప్రపంచంలోనే ఉన్నత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

## తెలంగాణ ప్రగతికి నవ సేద్యం

రైతు సంతోషంగా ఉంటేనే దేశం సుభిక్షంగా వర్ధిల్లుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన వ్యవసాయాన్ని ఆధునిక బాట పట్టించడం, సాగుదారుల రాబడిని పెంచడం నేడు అత్యావశ్యకం. ‘తెలంగాణ రైజింగ్’ పేరుతో రాష్ట్రం ఇప్పుడు ఒక కొత్త దశలోకి ప్రవేశిస్తోంది. ఇలాంటి తరుణంలో సేద్య రంగానికి ప్రపంచస్థాయి దిశా నిర్దేశం చేసేందుకు నేటి గ్లోబల్ సమ్మిట్‌లో ‘ది రేర్ స్ట్రాటజీ- విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా రైతుల ఆదాయం పెంపు’పై చర్చలు సాగనుండటం శుభ పరిణామం. వికసిత భారత్ ఆవిష్కృతమయ్యే 2047 నాటికి తెలంగాణను మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా వ్యవసాయ- ఆహార రంగాన్నీ అసాధారణ వృద్ధి రేటుతో జోరెత్తించాలని భావిస్తోంది. తెలంగాణను ప్రపంచ వ్యవసాయ యవనికపై ప్రత్యేకంగా నిలిపేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. ఆ దిశగా పెట్టుబడులతో పాటు నూతన ఆలోచనలనూ, మానవ వనరులనూ రాష్ట్రం వైపు తిప్పేందుకు ‘తెలంగాణ రైజింగ్’ గ్లోబల్ సమ్మిట్ ఉపయోగపడుతుంది. నేటి సాగు లక్ష్యం కేవలం అధిక దిగుబడులను సాధించడమే కాదు- ఉత్పత్తిని విలువగా మార్చడం, దాన్ని మార్కెట్లకు తీసుకెళ్లడం, మార్కెట్‌ను ప్రపంచంతో అనుసంధానం చేయడం, ప్రపంచస్థాయిలో పోటీపడేలా చిన్న రైతును సిద్ధం చేయడం! ఒకప్పుడు తెలంగాణ ఆహార స్వావలంబన కోసం పరుగులు తీసింది.

# ఇండిగోపై విచారణ జరుగుతోందన్న రామ్మోహన్ నాయుడు

### మొదటి పేజి తరువాయి

అంతర్గత ప్రణాళికా లోపం, సిబ్బంది రోస్టరింగ్ వ్యవస్థలోని సమస్యల వల్లే జరిగిందని ఆయన తేల్చిచెప్పారు. “ప్రస్తుతం మనం చూస్తున్న ఇండిగో సంక్షోభానికి వారి సిబ్బంది రోస్టరింగ్ వ్యవస్థ, అంతర్గత ప్రణాళికా వైఫల్యమే కారణం” అని మంత్రి అన్నారు.

సంఘటనల క్రమాన్ని వివరించిన కేంద్ర మంత్రి

ఈ సందర్భంగా మంత్రి పూర్తి వివరాలను సభ ముందుంచారు. ఇండిగో సంక్షోభానికి ముందు ఏం జరిగిందో వివరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు పైలట్లు, సిబ్బంది విధి నిర్వహణ సమయాలకు సంబంధించిన కొత్త నిబంధనలను ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు. ఈ నిబంధనల అమలుకు ముందు అన్ని విమానయాన సంస్థలతో, భాగస్వాములతో విస్తృతంగా చర్చలు జరిపినట్లు వివరించారు. మొత్తం 22 మార్గదర్శకాలలో 15 నిబంధనలను జూలై 1న, మిగిలిన 7 నిబంధనలను నవంబర్ 1 నుంచి అమలులోకి తెచ్చామని చెప్పారు. కొన్ని విమానయాన సంస్థలు తమ ప్రత్యేక అవసరాల రీత్యా (రాత్రిపూట కార్యకలాపాలు, ఈశాన్య రాష్ట్రాల



రూట్లు, ఏటీఆర్ విమాన సర్వీసులు) కొన్ని మినహాయింపులు కోరాయని, వాటిపై డీజీసీఏ పలు దఫాలుగా చర్చలు జరిపిందని తెలిపారు. కఠినమైన భద్రతా ప్రమాణాలను అంచనా వేసిన తర్వాతే అనుమతించదగిన మార్పులకు ఆమోదం తెలిపామని అన్నారు. కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాక నెల రోజుల పాటు కార్యకలాపాలు సజావుగా సాగాయని గుర్తుచేశారు. “డిసెంబర్ 1న కూడా ఇండిగో సంస్థ ప్రతినిధులతో సమావేశం జరిగింది. వారు కొన్ని వివరణలు కోరగా, మంత్రిత్వ శాఖ వాటిని అందించింది. ఆ సమావేశంలో కూడా ఇండిగో తమకు ఎలాంటి సవాళ్లు ఉన్నాయని చెప్పలేదు, ఏ సమస్యనూ మా దృష్టికి తీసుకురాలేదు. కానీ డిసెంబర్ 3న అకస్మాత్తుగా విమానాలు రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలిసిన వెంటనే పౌర విమానయాన శాఖ జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దింది” అని మంత్రి వివరించారు.

భద్రత విషయంలో రాజీ లేదు

“ప్రయాణికుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. పైలట్లు, సిబ్బంది, వ్యవస్థ, ప్రయాణికులు.. అందరి సంక్షేమం ప్రభుత్వానికి ముఖ్యమే. అన్ని విమానయాన సంస్థలు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని మంత్రిత్వ శాఖ చాలా స్పష్టంగా ఉంది” అని రామ్మోహన్ నాయుడు నొక్కి చెప్పారు. ఇది ఇండిగో సంస్థ రోజువారీ కార్యకలాపాలకు సంబంధించిన అంశమని, తమ సిబ్బందిని, రోస్టర్‌ను నిర్వహించుకోవాల్సిన బాధ్యత వారిదేనని అన్నారు. నిబంధనలు సక్రమంగా అమలయ్యేలా చూడటమే తమ పాత్ర అని, ఆ విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని స్పష్టం చేశారు. ఈ ఘటనపై ఇప్పటికే విచారణ జరుగుతోందని, ప్రభుత్వ స్పందన చాలా దృఢంగా ఉంటుందని మంత్రి పునరుద్ఘాటించారు. “మేం కఠిన చర్యలు తీసుకుంటాం. భవిష్యత్తులో నిబంధనల ఉల్లంఘనకు పాల్పడకుండా ఇదొక ఉదాహరణగా నిలుస్తుంది” అని ఆయన పేర్కొన్నారు.

# కరెంట్ ఛార్జీలపై సీఎం చంద్రబాబు గుడ్‌న్యూస్

### మొదటి పేజి తరువాయి

కరెంటు ఛార్జీలు ఈ ఏడాది కూడా పెంచమని... వచ్చే ఏడాది పెంచుకుంటామని సీఎం వెల్లడించారు. రాష్ట్రంలో చాలా చోట్ల గ్రౌండ్ వాటర్ పెంచగలిగామన్నారు. ఏపీ బ్రాండ్ రాష్ట్రంలో పూర్తిగా దెబ్బతిన్నదని.. పరిశ్రమలను వెళ్లగొట్టారని మండిపడ్డారు. విద్యా వ్యవస్థలో ఆంగ్ల మీడియం అని చెప్పి డ్రాపవుట్లను పెంచారన్నారు. ఆలిండియా లెవల్‌లో టాప్ ఫైవ్ ఉన్న ఎడ్యుకేషన్ సిస్టంను టాప్ త్రీ లేదా వన్‌కు తీసుకువస్తామని స్పష్టం చేశారు. భూగర్భ జలాలను పెంచడం కూడా చేశామన్నారు. ఇటీవల జరిగిన ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పెట్టుబడుల గురించి అందరికీ తెలిసిందన్నారు. జీఎస్డీపీ, తలసరి ఆదాయం ఎలా పెరిగిందో చూస్తే రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ గాడిలో పడుతోందని అర్థమవుతోందన్నారు. ప్రజలకు ఈ విషయాలన్నీ తెలియాలనే ఉద్దేశంతో అన్నీ చేస్తున్నామన్నారు. రాష్ట్ర విభజన తరువాత టీడీపీ అయిదేళ్లు అధికారంలో ఉందన్నారు. ఇక్కడ సరాసరి జీఎస్టీ 13.5 శాతం సాధించామని... కేంద్ర జీఎస్డీపీ కన్నా ఎక్కువ సాధించామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక 12.02 శాతం వృద్ధి సాధించామని.... ఆల్ ఇండియా లెవల్‌లో 9.8 శాతంగా ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కాగా.. 2025-26 తొలి అర్ధ సంవత్సరం (ఏప్రిల్ నుంచి సెప్టెంబర్)... అలాగే 2వ త్రైమాసికం (జూలై నుంచి సెప్టెంబర్) ఫలితాలను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. స్థిర ధరల వద్ద నమోదైన ఆర్థిక వృద్ధి, రాష్ట్ర స్థూల ఉత్పత్తి, గ్రాస్ వాల్యూ అడిషన్, వ్యవసాయం, ఉత్పత్తి, సేవా రంగాలు నమోదు చేసిన వృద్ధి గణాంకాలను విడుదల చేశారు. విభజన వల్ల రాష్ట్రానికి వ్యవస్థీకృతమైన నష్టం జరిగిందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. 2019-24 పాలన వల్ల వ్యవస్థలు డీఫంక్ట్ అయ్యాయని... రాష్ట్రం అప్పుల్లో కూరుకు పోయిందని తెలిపారు. గత పాలకుల విధ్వంస పాలన వల్ల గ్రోత్ రేట్ తగ్గి రూ.7లక్షల కోట్ల జీఎస్డీపీ కోల్పోయామని వెల్లడించారు. గ్రోత్ రేట్ లేకపోవటం వల్ల రూ. 76,195 కోట్ల ఆదాయం కోల్పోయామన్నారు. గత ప్రభుత్వంలో ఎక్కువ వడ్డీలకు అప్పులు తేవటం వల్ల ప్రజాధనానికి నష్టం కలుగుతోందని చెప్పారు. రుణాల రీ-షెడ్యూలింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బ్రాండ్ తగ్గినప్పుడు వడ్డీ రేటు పెరిగిపోతుందని... తద్వారా రెవెన్యూ జీఎస్డీపీలో రాష్ట్రం చాలా నష్టపోయిందని చెప్పుకొచ్చారు. 25 ఏళ్ల క్రితం చేసిన ఐటీ పాలసీ వల్ల తెలుగు వాళ్ల తలసరి ఆదాయం గరిష్టస్థాయిలో ఉందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు ఎలా పెంచాలన్నదే ఎప్పుడూ తన ఆలోచన అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

రెండో త్రైమాసికం ఫలితాలు:

రెండో త్రైమాసికం ప్రస్తుత ధరల్లో రాష్ట్ర జీఎస్డీపీ మొత్తంగా





11.28 శాతం వృద్ధి రూ.4,00,377 కోట్ల విలువైన జీఎస్డీపీ నమోదు. ఇదే సమయానికి భారతదేశ జీడీపీ 8.7 శాతంగా ఉంది. గతేడాది 2వ త్రైమాసికంలో రాష్ట్ర జీఎస్డీపీ 10.17 శాతంగా ఉంది. దీని విలువ రూ.3,59,778. అంటే ఈ త్రైమాసికంలో జీఎస్డీపీ గతేడాదితో పోల్చుకుంటే 1.11 శాతం పెరిగింది. 2వ క్వార్టర్‌కి రాష్ట్ర జీవీఏ 11.30 శాతం ఉండగా, జాతీయ జీవీఏ 8.7 శాతంగా నమోదైంది. రాష్ట్రంలో వ్యవసాయ - అనుబంధ రంగాల జీవీఏ 10.70 శాతం , పరిశ్రమల రంగం 12.20 శాతం, సేవల రంగం 11.30 శాతం వృద్ధి నమోదైంది. జాతీయ స్థాయిలో జీవీఏ వృద్ధి చూస్తే వ్యవసాయ రంగం 1.8 శాతం, పరిశ్రమల రంగం 8.5 శాతం, సేవల రంగం 10.6 శాతంగా ఉంది.

# తెలంగాణ అభివృద్ధి కోసం క్యూర్, ప్యూర్, రేర్ మోడల్స్

### మొదటి పేజి తరువాయి

ఈ సదస్సు జరుగుతోంది. సోమ, మంగళవారాల్లో ఇది కొనసాగనుంది. 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. అందరి సహకారంతో తాము లక్ష్యాన్ని అందుకుంటాం : కొత్త రాష్ట్రమైన తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2047కు సరికొత్త లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నామని అన్నారు. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగాలనేది తమ ఆశయమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని లక్ష్యంగా పెట్టుకున్నదని గుర్తు చేశారు. జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతం ఉండాలనేది తమ ఆశయమని చెప్పారు. పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల నుంచి ఆలోచనలు ఆహ్వానిస్తున్నామని, లక్ష్యం పెద్దది అయినప్పటికీ కష్టపడి సాధిస్తామనే నమ్మకం తమకుందని, అందరి సహకారంతో తాము లక్ష్యాన్ని అందుకుంటామని వివరించారు.

తెలంగాణ అభివృద్ధి కోసం క్యూర్, ప్యూర్, రేర్ మోడల్స్ : రేవంత్ రెడ్డి

సోనియా, మన్మోహన్ నేతృత్వంలో తెలంగాణ కల సాకారమైందని, తెలంగాణ దేశంలోనే కొత్త రాష్ట్రమని అన్నారు. అన్ని రంగాల నిపుణులు వచ్చినందుకు చాలా సంతోషమని తెలిపారు. దేశజనాభాలో 2.9 శాతమే ఉన్నా 5 శాతం ఆదాయం ఇస్తున్నామని, ఏ రాష్ట్రం చేయని విధంగా రాష్ట్రాన్ని 3 జోన్లుగా విభజించామని, 3 జోన్లను సేవ, తయారీ, వ్యవసాయ రంగాలకు కేటాయించామని, క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా పిలుచుకుంటున్నామని తెలిపారు. చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్ స్ఫూర్తిగా ముందుకెళ్తున్నామని, గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్ 20 ఏళ్లలోనే అత్యధిక పెట్టుబడులు సాధించిందని అన్నారు. తెలంగాణలో గ్వాంగ్‌డాంగ్ నమూనా అమలు చేయదలిచామని, చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ తమకు ఆదర్శమని వివరించారు. “దేశ స్వాతంత్ర్యం అనంతరం మన నాయకులు కొత్త రాజ్యాంగాన్ని రూపొందించి భవిష్యత్తు కోసం రోడ్ మ్యాప్ వేశారు. మేం కూడా తెలంగాణ భవిష్యత్తు కోసం రోడ్ మ్యాప్ రూపొందించాలనుకున్నాం. ఇందుకు మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, రాజ్యాంగ నిర్మాతల నుంచి ఎంతో స్ఫూర్తిని పొందాం. తెలంగాణ ప్రజలు దశాబ్దాలుగా ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారు. దేశజనాభాలో 2.9 శాతమే ఉన్నా 5 శాతం ఆదాయం ఇస్తున్నాం. ఏ రాష్ట్రం చేయని విధంగా రాష్ట్రాన్ని 3 జోన్లుగా విభజించాం. 3 జోన్లను సేవ, తయారీ, వ్యవసాయ రంగాలకు కేటాయించాం. క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా పిలుచుకుంటున్నాం.”- రేవంత్ రెడ్డి, సీఎం 2047లోగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారాలనేది లక్ష్యం : వికసిత్ భారత్ దిశగా తెలంగాణ వేగంగా అడుగులు వేస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. నిర్ణీత లక్ష్యాలు నిర్దేశించుకుని తెలంగాణ ముందుకెళ్తోందని అన్నారు. 2047లోగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారాలనేది లక్ష్యమన్న గవర్నర్, మహిళా రైతులను పలు విధాలుగా ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. “వికసిత్ భారత్ దిశగా తెలంగాణ వేగంగా అడుగులు వేస్తోంది. 2047లోగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారాలనేది మా లక్ష్యం. బస్సుల నిర్వహణ కూడా మహిళా సంఘాలకు ఇచ్చాం. విమానాశ్రయాలు, రైల్వేలు, రోడ్ల విస్తరణ దిశగా చర్యలు చేపట్టాం.”- జిష్ణుదేవ్ వర్మ, గవర్నర్ పరిశ్రమల హబ్‌గా తెలంగాణ మారుతోంది : తెలంగాణ గ్లోబల్ సమిట్ విజయవంతమైందని, ఈ రాష్ట్రం ప్రత్యేక విజన్‌తో ముందుకెళ్తోందని కైలాస్ సత్యార్థి అన్నారు. 20 లక్షల మంది రైతుల రుణాలు మాఫీ చేశారని, మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పించారని గుర్తు చేశారు. వికసిత్ భారత్ లక్ష్యం దిశగా ఈ రాష్ట్రం వేగంగా అడుగులు పడుతున్నాయని, 2047లోగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారుతుందని, గాంధీ, నెహ్రూ చూపిన దారిలో రేవంత్‌రెడ్డి పాలన నడుస్తోందని తెలిపారు. “బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అసాధ్యం. సమస్యలకు ప్రతి భారతీయుడూ ఒక పరిష్కారం చూపిస్తాడు. ఐకమత్యం, శాంతియుత పరిస్థితులతోనే అభివృద్ధి సాధ్యం. మొత్తం ప్రపంచాన్ని ఒకే కుటుంబంగా చూస్తాం. ప్రపంచం ఎదుర్కొనే అనేక సమస్యలకు భారత్ వద్ద పరిష్కారం. అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వాల నినాదం కావాలి.”- కైలాస్ సత్యార్థి ఫ్యూచర్ ఆఫ్ ఇండియా : కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనకు రెండేళ్లు పూర్తయిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఉత్పత్తి, నిర్మాణ రంగాల్లో అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామని అన్నారు. దేశంలోనే తొలిసారి ఏఐ విలేజ్ నిర్మిస్తున్నామని, స్పష్టమైన లక్ష్యంతో.. ధైర్యంగా, వేగంగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఏఐ, స్కిల్స్ యూనివర్సిటీలు వస్తున్నాయని, తమకు విజన్ ఉందని, తగిన ప్రణాళిక ఉందని, ఇది ఫ్యూచర్ ఆఫ్ తెలంగాణ మాత్రమే కాదని, ఫ్యూచర్ ఆఫ్ ఇండియా అని వివరించారు. పదేళ్లలో లక్ష కోట్ల పెట్టుబడులు : తెలంగాణలో ట్రంప్ మీడియా టెక్నాలజీస్ సంస్థ భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఫ్యూచర్‌సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమిట్ వేదికగా సంస్థ డైరెక్టర్ ఎరిక్ ఈ మేరకు ప్రకటించారు. వచ్చే పది సంవత్సరాలల్లో రూ.లక్ష కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. వచ్చే పదేళ్లలో ఈ రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో ఘన స్వాగతం లభించిందని, మంచి ఆతిథ్యం ఇచ్చారని తెలిపారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకెళ్లాలని అన్నారు. స్పష్టమైన ఆలోచనలతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని కొనియాడారు. కేంద్రం మరింత సహకారం అందిస్తుందని ఆశిస్తున్నాం : బెంగళూరుతో హైదరాబాద్ పోటీ పడుతోందని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. తర్వాత తరానికి ఏం కావాలో ఈ ప్రభుత్వం ఆలోచించిందని తెలిపారు. చిన్న రాష్ట్రమైనప్పటికీ తెలంగాణ కూడా గొప్ప వాటా కలిగి ఉందని కొనియాడారు. కాలిఫోర్నియా వంటి నగరాల్లో 13 లక్షల మంది భారత ఇంజినీర్లు పనిచేస్తున్నారని గుర్తు చేశారు. ఐటీ కంపెనీలకు బెంగళూరు, హైదరాబాద్ గమ్యస్థానంగా ఉన్నాయని అన్నారు. తెలంగాణ, బెంగళూరుకు కేంద్రం మరింత సహకారం అందిస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు. అంతకుముందు వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించిన సీఎం, సదస్సు ప్రాంగణంలో తెలంగాణ తల్లి డిజిటల్ విగ్రహం ఆవిష్కరించారు.

# చైనా వీసా విధానంలో కీలక మార్పులు- డిసెంబర్ 22న ఆన్‌లైన్ దరఖాస్తు వ్యవస్థ ప్రారంభం

### మొదటి పేజి తరువాయి

ఢిల్లీ: వీసా విధానంలో చైనా కీలక మార్పులను తీసుకొచ్చింది. వీసా దరఖాస్తు విధానాన్ని సరళీకృతం చేసింది. ఇందుకోసం ఈనెల 22న ఆన్‌లైన్ వీసా దరఖాస్తు వ్యవస్థను అధికారికంగా ప్రారంభించనున్నట్లు భారత్?లోని చైనా రాయబారి క్సూ ఫైహాంగ్ సోమవారం ప్రకటించారు. ఈ కొత్త వ్యవస్థ ద్వారా చైనా వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారు ఇకపై ఆన్‌లైన్ సదుపాయాన్ని వినియోగించవచ్చు. అవసరమైన దరఖాస్తు పత్రాలను అప్‌లోడ్ చేయవచ్చు. ఈ మేరకు భారత్?లోని చైనా రాయబారి ఫైహాంగ్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తు దారులు పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్?సైట్? సంప్రదించవచ్చునని భారత్?లోని చైనా రాయబారి ఫైహాంగ్ పేర్కొన్నారు. ఇందులో వీసా దరఖాస్తుకు సంబంధించిన వివరాలు, ఫారమ్?లు ఆన్?లైన్?లో పొందుపరుచువచ్చునని పేర్కొన్నారు.

గత నెల పర్యాటక వీసాల పునరుద్ధరణ

అంతకుముందు 2025 నవంబరు 26న, చైనా జాతీయులకు పర్యటక, వ్యాపార ప్రయోజనాల కోసం వీసా ప్రక్రియను పునఃప్రారంభిస్తున్నట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇకపై చైనా జాతీయులకు పర్యాటక వీసా ప్రక్రియ కొనసాగుతుందని విదేశాంగ ప్రతినిధి రణధీర్? జైస్వాల్ మీడియా సమావేశంలో పేర్కొన్నారు. 2020లో తూర్పు లద్దాఖ్?లోని గల్వాన్ లోయలో భారత్, చైనా సైన్యాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో 20 మంది భారత సైనికులు అమరులయ్యారు. అలాగే, చైనా సైన్యానికి కూడా భారీ నష్టం వాటిల్లింది. ఈ వివాదాల అనంతరం ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో వీసా ప్రక్రియ, విమాన సర్వీసులను సైతం నిలిపివేశారు. అయితే, ఇటీవల లద్దాఖ్ సరిహద్దులో బలగాల ఉపసంహరణ, గస్తీ పునఃప్రారంభం, విమాన సర్వీసుల పునరుద్ధరణ, కైలాస మానససరోవర్ యాత్ర పునఃప్రారంభం వంటి విషయాల్లో ఇరుదేశాలు పలు ఒక అవగాహనకు వచ్చాయి. దీంతో భారత్?, చైనాల మధ్య సంబంధాలు కొంతవరకు మెరుగుపడ్డాయి. అంతకుముందు చైనీయులకు భారత్ టూరిస్టు వీసాల జారీ ప్రక్రియను పునః ప్రారంభిస్తున్నట్లు చైనాలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. జులై 24 నుంచి చైనా పౌరులకు టూరిస్టు వీసాలు మంజూరుచేయనున్నట్లు తెలియజేసింది.

భారత్ - చైనా బంధం బలోపేతం

2024 అక్టోబరు నుంచే తూర్పు లద్దాఖ్‌లోని ఎల్ఏసీ వద్ద సైనిక ఉద్రిక్తతలు తగ్గాయి. దీంతో భారత్?, చైనా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం దిశగా అడుగులు పడే ప్రక్రియ మొదలైంది. సరిహద్దుల్లో సైనిక ఉద్రిక్తతలను తగ్గించాలనే ఏకాభిప్రాయానికి భారత్ - చైనా వచ్చాయి. ఈ ఏడాది ఆగస్టులో రష్యాలోని టియాంజిన్ వేదికగా జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. 2024 సంవత్సరంలో చైనాతో భారత్ 127 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం జరిపింది. ఇందులో 109 బిలియన్ డాలర్లు చైనా ఎగుమతుల నుంచే వచ్చింది. ఓ వైపు సరిహద్దులపై విభేదాలున్నా, మరోవైపు వాణిజ్యపరంగా భారత్ - చైనా బంధం కొనసాగుతున్న తీరుకు ఈ గణాంకాలే నిదర్శనమని నిపుణులు చెబుతున్నారు.

# దేశ ఐక్యతకు చిహ్నం ‘వందేమాతరం’

### మొదటి పేజి తరువాయి

ఈ చర్చలో పాల్గొనడం నాకు గర్వకారణం. వందేమాతరం స్వాతంత్ర్య పోరాటంలో ప్రేరణ కలిగించింది. వందేమాతరాన్ని వికసిత్ భారత్‌కు సంకల్పంగా తీసుకున్నాం. 1857 తర్వాత స్వాతంత్ర్య సమరయోధులపై ఒత్తిడి పెంచారు. ఒత్తిడి పెరిగినా వెనక్కి తగ్గకుండా వందేమాతరం రచించారు. స్వాతంత్ర్య ఉద్యమ ప్రతి సమయంలో వందేమాతరం వినిపించింది. దేశ ఐక్యతకు చిహ్నంగా వందేమాతరం నిలిచింది. దేశాన్ని అనేక ముక్కలు చేసేందుకు ఆంగ్లేయులు శతవిధాలా ప్రయత్నించారు. భారత్ అనేక ముక్కలు కాకుండా వందేమాతర నినాదం సాయం చేసింది. వందేమాతర నినాదం బ్రిటిషర్లకు సింహస్వప్నంగా మారింది. భారత్ నలువైపులా వందేమాతర నినాదం మారుమోగింది. మాతృభూమి దాస్య శృంఖలాలు తెంచేందుకు కీలకంగా మారింది. వందేమాతరం ఆజాద్ భారత్‌కు విజన్‌గా మారింది. పాలనలో భారతీయుల శక్తి సామర్థ్యాలపై సందేహం వెలిబుచ్చారు. కష్టసమయంలో ప్రజలకు దారిదీపంగా వందేమాతరం నిలిచింది. మనదేశం జ్ఞానం, సమృద్ధికి మారుపేరు. వందేమాతరం గేయం శత్రువుల చెవుల్లో మారుమోగింది.”

**నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి**

వందేమాతరం రచించిన సమయంలో భారతదేశంలోని ప్రతీ ఇంట్లో బ్రిటిష్ జాతీయ గీతమైన గాడ్ సేవ్ ద క్వీన్‌ను ఆలపించేలా చేయాలని యత్నించారని మోదీ గుర్తుచేశారు. వందేమాతరానికి 50 ఏళ్లప్పుడు దేశం బ్రిటిష్ పాలనలో ఉందని, అది వందేళ్లు పూర్తిచేసుకున్నప్పుడు దేశం ఎమర్జెన్సీలో ఉందని వివరించారు. ఆ విధంగా బెంగాల్ మేధో సంపత్తి దేశానికి ప్రేరణనిచ్చిందన్న మోదీ, బ్రిటిష్ దాన్ని విచ్ఛిన్నం చేయాలనే కుట్రతో విభజించు పాలించు విధానాన్ని తీసుకువచ్చారని తెలిపారు. 1905లో వారు బెంగాల్‌నైతే విభజించారు, కానీ వందేమాతరం ఒక దృఢమైన రాయిలా నిలిచి దేశ ఐక్యతకు స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు. “బంగాల్ ఐక్యతకు వందేమాతర గేయం పాత్ర ఎనలేనిది. వందేమాతర నినాదం ఉచ్చరించకూడదని నిషేధం విధించారు. నిషేధం, ఆజ్ఞలు పట్టించుకోకుండా ప్రజలు పోరాటం చేశారు. బంగాల్ వీధుల్లో ప్రారంభమై దేశప్రజల నినాదంగా మారింది. ఆఖరికి చిన్నారులు కూడా వందేమాతర నినాదాలు చేశారు. వందేమాతరం నినాదాలు వినలేక ఆంగ్లేయులు దారుణాలకు ఒడిగట్టారు. దేశంలో అనేకచోట్ల ఉద్యమకారులను కఠినంగా అణచివేశారు. వందేమాతరం నినాదాలు చేస్తూ ఎందరో ప్రాణాలు అర్పించారు. ఉరిశిక్ష అమలుచేసే ముందూ వందేమాతరం నినాదాలు చేశారు.” అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ క్రమంలోనే వందేమాతరం గేయంపై కవితలు చదివి వినిపించారు. వందేమాతర జాతీయ గీతంపైనా కాంగ్రెస్?, జవహర్ లాల్ నెహ్రూ దాడి చేశారని మోదీ ఆరోపించారు. వందేమాతరం ముస్లింలను రెచ్చగొట్టేలా ఉందని జవహర్ లాల్ నెహ్రూ భావించారని ప్రధాని అన్నారు.

కదిలించే వార్త తెలుగు దినపత్రిక
మంగళవారం- 09 -డిసెంబర్ - 2025

# స్వేచ్ఛగా పిటీషన్లు అందజేయండి...

# చట్టపరిధిలో పరిష్కారం చూపుతాం

### జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్

### జిల్లా పోలీస్ కార్యక్రమానికి 128 పిటీషన్లు




అనంతపురం, క్రైమ్, **కదిలించే వార్త డిసెంబర్ 08 :** జిల్లా పోలీస్ శాఖ ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. ఈ క్రమంలో సోమవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఎస్పీ ప్రతి పిటిషన్‌ను వ్యక్తిగతంగా పరిశీలించి, సమస్యల స్వరూపాన్ని మరియు తీవ్రతను తెలుసుకున్నారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**జిల్లా ఎస్పీ మాట్లాడుతూ:**

పోలీస్ శాఖ ప్రజాసేవనే ధ్యేయంగా తీసుకుని, ప్రతి బాధితుడికి న్యాయం అందే వరకు కృషి చేస్తుందన్నారు ప్రజలు భయపడకుండా, ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలన్నారు కార్యక్రమం ద్వారా వచ్చిన పిటిషన్లు పారదర్శకంగా నమోదు చేసి, నిర్దిష్ట వ్యవధిలో పరిష్కార చర్యలను కొనసాగిస్తామన్నారు సామాజిక సమస్యలు, కుటుంబ కలహాలు, భూ వివాదాలు, మహిళల భద్రత, సైబర్ మోసాలు, ట్రాఫిక్ సమస్యలు వంటి అన్ని అంశాలపై పోలీస్ శాఖ 24 గంటలు సేవలందిస్తుందని తెలిపారు. అలాగే జిల్లా శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొంటూ, అనుమానాస్పద వ్యక్తులు, సంఘటనలు గమనించినప్పుడు వెంటనే సంబంధిత పోలీసులకు లేదా డయల్ 100/112 కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు ఈకార్యక్రమంలో అనంతపురం మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఎస్ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

# ప్లీజ్ అన్నవిత్ డ్రా చేసుకో సర్పంచ్, వార్డు అభ్యర్థులకు బుజ్జగింపులు, బేరాసారాలు

### నేడే విత్ డ్రా లు తగ్గేది ఎవరో నిలిచేది ఎవరో




ఆత్మకూరు/ **కదిలించే వార్త డిసెంబర్ 08 :** ఆత్మకూరు మండలంలో మూడవ దశలో ఎన్నికలు జరిగే గ్రామాలలో నామినేషన్ ప్రక్రియ పూర్తవడంతో బరిలో ఉండే అభ్యర్థులు ఎవరో తెలిసిపోయింది. నేడే ఉపసంహారణ ఉండడంతో తగ్గేది ఎవరో బరిలో నిలిచేది ఎవరో చూడాల్సిందే .ఒక్కో పార్టీ నుండి ఒక్కరే పోటీ చేసే విధంగా అభ్యర్థులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అధికార పార్టీలో రెబల్స్ బెడద వెంటాడుతోంది. మూడో దశ ఒక్కో గ్రామంలో సర్పంచ్ పదవికి ఐదు నుంచి పది వరకు దరఖాస్తులు చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీలోనే కాదు బి ఆర్ ఎస్ పార్టీలో కూడా పోటీ తీవ్రత కనిపిస్తోంది. తమ ప్రత్యర్థుల సన్నిహితులు, ఆయా పార్టీ లీడర్ల ద్వారా బుజ్జగింపులు, బే రాసారాలకు దిగుతున్నారు. సర్పంచ్ ఎన్నికల్లో తనకు సహకరిస్తే ఎంపిటిసి ఎన్నికల్లో సహకరిస్తానని ఒప్పందం చేసుకుంటున్నారు. సర్పంచి అభ్యర్థితో పాటు వార్డు మెంబర్స్ స్థానాలకు బరిలో నిలిచిన వారు కూడా ఇలాంటి వ్యూహాలే అనుసరిస్తున్నారు. పోటీ నుండి తప్పుకుంటే ప్యాకేజీ లు 5 లక్షల నుండి 10 లక్షలు వరకు ఇస్తామంటూ బేరా సారాలాట బరిలో నుంచి తప్పించేందుకు ప్యాకేజీ సైతం ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. భవిష్యత్తులో ఇతర పదవులు ఇప్పిస్తామని భరోసా కల్పిస్తున్నారు. పోటీ నుండి తప్పుకుంటే 5 లక్షల నుండి 10 లక్షలు ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. రాబోయే ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల్లో రిజర్వేషన్ కలిసి వస్తే మీరే మా పార్టీ అభ్యర్థి ఎన్నికల ఖర్చు కూడా మేమే పెట్టుకుంటామని హామీ ఇస్తున్నట్లు తెలుస్తోంది. సమస్యలను గాలికి వదిలి గెలుపు కోసం వ్యూహాలను చేస్తున్నారు. గ్రామాల ప్రజలు పోటీ చేసిన వారిలో విద్యావంతుల వైపు చూస్తున్నారు. తమ సమస్యలు తీర్చే వారి కి ఓటు వేస్తామని అంటున్నారు.

# అనారోగ్య కారణాలతో ఓ మహిళ చనిపోతే కన్న కొడుకులు లాగా నిలిచిన అనంతపురం త్రీ టౌన్ పోలీసులు

### మానవత్వం చాటిన త్రీటౌన్ సి.ఐ ఆధ్వర్యంలో పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్

అనంతపురం, క్రైమ్, **కదిలించే వార్త డిసెంబర్ 08 :**




వివరాలు : శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షి మండలానికి చెందిన వెంకటలక్ష్మి (47) ఎన్నో రోజులుగా తీవ్రమైన అనారోగ్యంతో జీవన పోరాటం చేస్తున్నారు. పేదరికం మధ్య ఆమెకు ఒకే ఆధారంబెంగళూరులో కూలీ పనులు చేసి తల్లిని నిలబెట్టాలనే తపనతో బ్రతికే ఇద్దరు కుమారులు. వారిలో పెద్ద కుమారుడు వెంకటేశ్వర్లు అమ్మకు మెరుగైన చికిత్స దొరకాలని ఆశిస్తూ అనంతపురానికి తీసుకువచ్చాడు. చికిత్స పూర్తయి, తమ స్వగ్రామమైన లేపాక్షికి తిరిగి వెళ్లేందుకుగా నిన్న రైల్వే స్టేషన్‌లో ఎదురుచూస్తున్న సమయంలో, దురదృష్టవశాత్తూ వెంకటలక్ష్మి ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించి ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తల్లిని కోల్పోయిన బాధతో విలవిలలాడుతున్న కుమారుడు మద్యం సేవించిన స్థితిలో ఉండటంతో ఏం చేయాలో తెలియక పూర్తిగా నిస్సహాయ స్థితిలో ఉండిపోయాడు. దిక్కుతోచని పరిస్థితిలో అతని ఆశ్రయం 100 మాత్రమేనని భావించా కాల్ చేశాడు. అతని మనోవేదనను అర్థం చేసుకున్న అనంతపురం త్రీ టౌన్ సి.ఐ రాజేంద్రనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు అర్ధరాత్రి ఒకటిగంట సమయంలోనే రైల్వే స్టేషన్‌కు వచ్చి కేవలం విధి కాదుమానవత్వం, కన్న కొడుకులు లాగా ప్రేమతో ముందుకొచ్చారు. తల్లిని కోల్పోయిన కుమారుడిని ఆదరించి ధైర్యం చెప్పి, పరిస్థితిని స్వయంగా తమ భుజాలపై తీసుకున్నారు. పోలీసులు మానవీయ స్పందనలో అంబులెన్స్‌ను స్వయంగా ఏర్పాటు చేసి, కుటుంబ సభ్యుల్లా ముందడుగు వేశారు. వెంకటలక్ష్మి మృతదేహాన్ని ఆమె స్వగ్రామానికి గౌరవపూర్వకంగా పంపించారు. ఆ క్షణంలో ఆ కుటుంబానికి నిజమైన బంధువులు ఎవరో అంటేపోలీసులే. తల్లిని కోల్పోయి కన్నీరు మున్నీరు అయ్యిన కుమారులు, బంధువులు హృదయపూర్వకంగా స్పందిస్తూ "మా కష్ట సమయంలో మా కుటుంబంలా, కన్న కొడుకుల్లా నిలిచిన పోలీసులకు ఎప్పటికీ రుణపడి ఉంటాం " అని భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటన మరోసారి నిరూపించింది పోలీసు యూనిఫారమ్‌లో కేవలం విధి కాదు మానవత్వం, మనసు, ప్రేమ కూడా ఉంటాయనేవి స్పష్టమయ్యాయి.

# అందుబాటులోకి డెక్కన్స్ లైట్స్ క్రాఫ్ట్



కడప **కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** కడప నగరంలోని కృష్ణదేవరాయలు సర్కిల్ సమీపం నందు ఉమర్ బిలాల్ ఆహ్వానం మేరకు డెక్కన్స్ లైట్స్ క్రాఫ్ట్ షోరూమ్ ను మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి.అంజాద్ భాష ప్రారంభించారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజలకు ఇంటికి సంబంధించిన అధునాతనమైన డిజైన్లతో లైటింగ్స్ షోరూములు ప్రోప్రైటర్లు ఉమర్ బిలాల్ డెక్కన్, ఉస్మాన్ డెక్కన్ ప్రారంభించడం చాలా ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అక్బర్ అలీ, చాక్లెట్ గౌస్, జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి జఫుల్లా, అబ్దుల్ ఖాదర్, ఆరిఫ్, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

# తరగతులు నిర్వహించని ఐ టీ ఐ కాలేజీలను బ్లాక్ లిస్టులో పెట్టాలి.

### ప్రయివేట్ కాలేజీల అక్రమాలపై సమగ్రవిచారణ జరిపించి చర్యలు తీసుకోవాలి....

### పి ఎస్ యు జిల్లా కార్యదర్శి దారా గోపి




కడప **కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి విద్యార్థులకు తరగతులు నిర్వహించకుండా ఫీజురియంబర్స్ మెంట్ పొందుతున్న ప్రయివేట్ ఐ టీ ఐ కాలేజీల అక్రమాలపై విజిలెన్స్ అధికారులతో సమగ్ర విచారణ జరిపించి వాటిని బ్లాక్ లిస్టులో పెట్టాలని ప ఎస్ యు జిల్లా కార్యదర్శి దారా గోపి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కడప నగరంలోని ఆర్ ఎస్ ప కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కడప జిల్లా వ్యాప్తంగా 23 ప్రయివేట్ ఐటిఐ కాలేజిలు వున్నాయి. 2024-25, 2025-26 విద్యాసంవత్సరంలో 3914 మంది విద్యార్థులు చేరారని తెలిపారు. ఈ కాలేజీలలో కాలేజీలలో మొత్తం 500 మంది కూడా ప్రతిరోజూ కాలేజీలకు హాజరు కావడంలేదని అన్నారు. ప్రభుత్వ ప్రమాణాలు పాటించకుండా బోగస్ అడ్మిషన్స్ తెచ్చుకొని ప్రభుత్వం నుంచి ఫీజు రియంబర్స్మెంట్ పొందుతున్నారని పేర్కొన్నారు. కనీస వసతులు అయిన క్లాస్ రూమ్స్, ల్యాబ్, లైబ్రరీ, తోపాటు టాయిలెట్, సౌకర్యాలు కల్పించి అందులో చేరిన విద్యార్థులను నైపుణ్యులుగా తీర్చి దిద్దాల్సిన ప్రయివేట్ ఐటిఐ కాలేజుల యాజమాన్యం ఇందుకు విరుద్ధంగా నడుస్తున్నాయని మండిపడ్డారు. పరీక్షల సమయంలో ఆర్ డి డి, కన్వీనర్ లాంటి ఆఫీకారులను మేనేజ్ చేసుకొని సెల్ఫ్ సెంటర్స్ వేయించుకొని, వారికి అనుకూలంగా వున్న ట్రైనర్స్ ను ఇన్విజిలేషన్, చీప్ డిపార్ట్మెంట్ అధికారులుగా నియమించుకొని మాస్ కాపీయింగ్ పాల్పడుతు రెగ్యులర్గా కళాశాలలకు వెళుతున్న పేద విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. కాలేజీలలో చేరిన విద్యార్థులకు నిబంధనల ప్రకారం తరగతులు నిర్వహించకుండా గ్యారెంటీ పాస్ స్కీమ్ పేరుతో గ్రామీణ ప్రాంతాలలోని ఎస్సీ, బీసీ, ఎస్టీ మైనారిటీ విద్యార్థుల వద్ద నుండి వేల రూపాయలు ఫీజులు వసూలు చేయడతోపాటు విద్యార్థులు కళాశాలకు రాకపోయినా వచ్చినట్లు హాజరు వేస్తూ ప్రభుత్వం నుండి లక్షల కోట్ల రూపాయలు స్కాలర్షిప్, ఫీజ్రియాంబర్స్ మెంట్ పొందుతన్న ఐ టీ ఐ కాలేజిల అక్రమాలపై ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంక్షేమ శాఖల, విజిలెన్స్ అధికారులతో విచారణ కమిటీ వేసి విచారణ జరిపించి ప్రభుత్వ సొమ్మును తప్పుడు పద్ధతుల్లో పొందుతున్న ప్రయివేట్ ఐటిఐ కాలేజీలను బ్లాక్ లిస్టులో పెట్టి, వాటి గుర్తింపు రద్దు చేయలని కోరారు లేకపోతే జిల్లా వ్యాప్తంగా ప ఎస్ యు ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమలో నరసింహ హరి రత్నపాల్ పాల్గొన్నారు.

# 12 జిల్లాలతో కలిపి ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం ఏర్పాటు చేయాలి.

### ప్రధానమంత్రి కి లేఖ డాక్టర్. కుంచం వెంకటసుబ్బారెడ్డి



కడప **కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, రాయచూరు, బళ్ళారి, కోలార్ చిత్రదుర్గ, క్రిష్ణగిరి, వేలూరు జిల్లాలతో కలిపి ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం ఏర్పాటు కోసం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3ను అనుసరించి ప్రైవేటు బిల్లు పెట్టి, తీర్మానము చేసి ప్రత్యేక రాయలసీమ రాష్ట్రంగా ప్రకటించాలని భారత ప్రధానమంత్రి కి రాయలసీమ రాష్ట్ర సమితి భారత ప్రధానమంత్రి కిఅధ్యక్షులు డా. కుంచం వెంకటసుబ్బారెడ్డి లేఖ రాయడం జరిగిందన్నారు. సోమవారం ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మా రాయలసీమ ప్రాంతం అన్నివిధాలా వెనుకబడిన ప్రాంతం. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రాయలసీమను పై జిల్లాలతో కలిపి ప్రత్యేక రాష్ట్రం ప్రకటించడమే తప్ప వేరే మార్గము లేదు. పైన తెలిపిన జిల్లాలతోమా రాయలసీమ ప్రాంతంలో సుమారు 4 కోట్లకు పైగా జనాభా గలిగి వుండును. ప్రత్యేక రాష్ట్రం ప్రకటన చేసినచో పైజనాభాతో మన దేశంలో వున్న మెట్రోపాలిటన్ నగరాల మాదిరిగానే యి ప్రాంతంకూడా అభివృద్ధి చేందేందుకు అవకాశం మెండుగా కలదు. మా రాయలసీమ ఇప్పటికి మరెప్పటికీ రతనాలసీమనే. ఈ ప్రాంతంలో తరగని ఖని, సహజ సంపంద బహుళంగా వున్నది. మా రాయలసీమ మన రాయలసీమ ప్రపంచలో వున్న 42 దేశాలకంటే పెద్దది,అదే విధముగా మా రాయలసీమ భారతదేశంలోని 29 రాష్ట్రాలలో 14 రాష్ట్రాలకంటే పెద్దది. మా రాయలసీమ ప్రాంతంలో ప్రపంచంలోనే పోప్ చర్చి తరువాత రెండో ఆదాయం కలిగిన తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆదాయం కలిగి వున్నది. ఈ ప్రాంతంను సస్యశ్యామలంగా చేయాలంటే ప్రత్యేక రాయలసీమ రాష్ట్రంగా ప్రకటించినచో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి నదులను అనసంధానం చేసి వలసలు నివారించడానికి, నిరక్షరాస్యత నిర్మూలించుటకు విశ్వ విద్యాలయాలు ఏర్పాటు చేసి నిరక్షరాస్యత నిర్మూలించడానికి ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం అత్యవసరం. మా రాయలసీమ ప్రాంతంలో ఒక్క జిలకర తప్ప అన్ని రకాల పంటలు పండుతాయి. మరియ దేశంలో కరువు నాట్యం చేస్తున్నా కూడా మా రాయలసీమ ప్రాంతాల నుండి ఎగుమతి తప్ప దిగుమతి అనే ప్రశ్నే లేదు. మా రాయలసీమకు తూర్పున"మిళనాడు, పడమర కర్నాటక, ఉత్తరాన తెలంగాణ మధ్యలో మా బంగారు రాయలసీమ. ఇన్ని రకాలుగా అన్ని వనరులు కలిగిన మా రాయలసీమను పట్టించుకునే నాథుడు లేక, అభివృద్ధికి పాటుపడేవారు లేక చదువుకున్న వారు డిగ్రీలు, పి.జి.పి.హెచ్.లు, సాంకేతిక పట్టాలు పొందిన వారు మా రాయలసీమ ప్రాంతంలో ఉపాధి అవకతాశాలు లేక వలసపోవలసిన పరిస్థితి ఏర్పడుచున్నది, ఏలాంటి పారిశ్రామిక అభివృద్ధింక, ఆర్థికంగా వెనుకబడినందున అందరూ బిచ్చగాలుగా వున్నాము. కోలార్‌జి కావున తమరు మా రాయలసీమ ప్రాంత ప్రజల ఆర్తిని పరిగణనలోకి తీసుకొని కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, రాయచూరు, బళ్ళారి, చిత్రదుర్గ, క్రిష్ణగిరి, వేలూరు జిల్లాలతో కలిపి ప్రత్యేక రాయలసీమ ఏర్పాటు కొరకు రోడ్ మ్యాప్ తయారు చేసి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3ను అనుసరించి ప్రైవేటు బిల్లు పెట్టి, తీర్మానము చేసి ప్రత్యేక రాయలసీమ రాష్ట్రంగా ప్రకటించాలని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షులు డా. కుంచం వెంకటసుబ్బారెడ్డి ప్రధాన మంత్రివర్యులపై వత్తిడి తెచ్చి రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించాలని, వెంటనే సంబంధిత అధికారులకు ప్రత్యేక రాయలసీమకు ప్రత్యేకప్రత్యే ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయాలని విన్నవించడమైనది. మన నీళ్ళు, మన నిధులు మన నియామకాలతో ముందుకెళ్ళితే మన రాయలసీమ భవిష్యత్తు మన పిల్లల భవిష్యత్తు బంగారమయమే. మన రాయలసీమ అస్థిత్వాన్ని మన రాయలసీమ ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం. మన రాయలసీమ పతాకాన్ని ఎగురవేద్దాం.

# క్రాస్ కంట్రీ నిర్వహించిన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్



కడప **కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** కడప నగరంలోని ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, కడప సోమవారం క్రాస్ కంట్రీ రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రాస్ కంట్రీ రన్ ను పాఠశాల ప్రిన్సిపల్ అమిత్ సింగ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల చిన్నారులంతా ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో శారీరక దృఢత్వాన్ని, క్రమశిక్షణను, చురుకుదనాన్ని పెంపొందించి వారిని ఆరోగ్యవంతులుగా ఉంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించ బడినదన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా సాగడానికి ట్రాఫిక్ నియంత్రణలో పోలీసు శాఖ అందించిన సహకారం ప్రత్యేకంగా నిలిచింది. తరగతుల వారీగా నిర్వహించిన ఈ క్రాస్ కంట్రీలో ప్రతి కేటగిరీ నుండి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారిని విజేతలుగా ప్రకటించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల ఉత్సాహభరిత భాగస్వామ్యం వల్ల విజయవంతం అయ్యింది. ఈ కార్యక్రమంలో ఉప ప్రధానాచార్యులు శ్రీనివాసమూర్తి, రిజిస్ట్రార్ రహమతుల్లా, యాక్టివిటీ కోఆర్డినేటర్ సలీం అహ్మద్, వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడా శిక్షకులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఫసల్ బీమా ఇన్సూరెన్స్ గడువును పొడగించండి

### 32 వ వార్డు కౌన్సిలర్ మూలి మహేశ్వర్ రెడ్డి



పులివెందుల **కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ఫసల్ బీమా ఇన్సూరెన్స్ పాలసీ గడువును పొడగించాలని 32 వ వార్డు కౌన్సిలర్ మూలి మహేశ్వర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి రైతుల ఆర్తనాధాలను అర్థం చేసుకోవాలని ఫసల్ బీమా ఇన్సూరెన్స్ పథకానికి సంబంధించి ప్రచారంలో డబ్బులు చెల్లించి నష్టాన్ని అరికట్టుకోండి అని భారీ డైలాగులు చెబుతున్నారు కానీ అగ్రికల్చర్ ఆఫీస్ దగ్గరికి వెళ్లి రైతు ఏ పంట చేసుకున్నాడో ఆ పంటకు పేపర్ అడిగితే అగ్రికల్చర్ ఆఫీసులో అడిగితే ఫసల్ బీమా పోర్టల్ ఇంకా ఓపెన్ కాలేదు అని చెప్తున్నారు ఇక్కడేమో డిసెంబర్ 15 చివరి తేదీగా చెబుతున్నారని అగ్రికల్చర్ వాళ్లకు ఫోన్ చేసినా కట్టించుకునే వాళ్లకు ఫోన్ చేసినా పోర్టల్ ఓపెన్ కాలేదు మేము ఏం చేయాలని తెలియజేస్తున్నారని కావున దయచేసి వ్యవసాయ శాఖ మంత్రి అగ్రికల్చర్ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రజలు బాధలు తెలుసుకొని ఇన్సూరెన్స్ గడువు పొడిగించవలసిందిగా ఒక రైతు సోదరుడిగా అభ్యర్థనను పరిగణలోనికి తీసుకోవాలని తెలిపారు.

# టీటీడీ కళ్యాణ మండపాలను ఆధునికరించి అందుబాటులోకి తెస్తాం

### గోవిందుడు అందరివాడిగా గుర్తించి సేవలందిస్తాం

### పరకామణి కేసు పరాకాష్టకు చేరుకుంది

### టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్



పులివెందుల **కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** రాష్ట్రంలోని 994 శిథిలావస్థలో ఉన్న టీటీడీ కళ్యాణ మండపాలను ఆధునికరించి అందుబాటులోకి తెస్తామని, గోవిందుడు అందరివాడిగా భావించి భక్తులందరికీ స్వామివారి దర్శన భాగ్యం కలిగేలా సేవలను విస్తృత పరుస్తామని, పరకామణి కేసు పరాకాష్టకు చేరుకున్నదని త్వరలోనే నిందితులను ప్రజల ముందు ఉంచుతామని టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం పులివెందుల నియోజకవర్గంలోని టీటీడీ కల్యాణ మండపాలను పరిశీలించేందుకు బీజేపీ నేత, టీటీడీ బోర్డ్ మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి రాగా పులివెందుల టీటీడీ కల్యాణ మండపం వద్ద వారికి కూటమి నాయకులు సాదర స్వాగతం పలికారు. రాష్ట్ర మార్క్ ఫైడ్ డైరెక్టర్ వంగల శశి భూషణ్ రెడ్డి, ?తొండూరు మండల టీడీపీ ఇంచార్జ్ శివ మోహన్ రెడ్డి, పులివెందుల టీడీపీ సోషల్ మీడియా ఇంచార్జ్ వర్ధన్ రెడ్డి, సాయి కృష్ణా రెడ్డి భాను ప్రకాష్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి పలు వినతులను అందించారు. ఈ సందర్భంగా భాను ప్రకాష్ మాట్లాడుతూ పెండింగ్ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి సామాన్య, మధ్యతరగతి భక్తులు ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో అధిక ధరలు చెల్లించే సమస్యను పరిష్కరిస్తామని, టిటిడి కళ్యాణ మండపాలలో తిరుమల తిరుపతి దేవస్థానం సేవల కౌంటర్ ను ప్రారంభించే ప్రయత్నం చేస్తామని, సమాజంలో ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేయడంలో మరియు ప్రజల సమస్యలను ప్రభుత్వానికి అందించడంలో వారధి పాత్ర పోషిస్తున్న పాత్రికేయ కుటుంబ సభ్యులకు స్వామి వారి దర్శన సౌకర్యాన్ని కల్పించేందుకు పాలకమండలిలో చర్చిస్తామని, పరకామణి కేసు పరాకాష్టకు చేరుకున్నదని, పరకామణి కేసును చిన్న దొంగతనం కేసుగా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పేర్కొనడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహేశ్వర రెడ్డి, నవీన్ ,ఉపేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పార్నపల్లి రోడ్డులో వెలుగులు లేని వీధిలైట్లు

### ప్రమాదాలు జరిగితే స్పందిస్తారా

### ఆరు దాటితే ఆందోళనలో ప్రజలు

### చీకటిలో మున్సిపల్ విద్యుత్ స్తంభాన్ని వాహనం ఢీ కొట్టిన వైనం



పులివెందుల **కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** పులివెందుల పట్టణ పరిధిలోని పార్నపల్లి రోడ్డు నందు వీధిలైట్ల వెలుగులు లేక ఆరు దాటితే పాదచారులు ఆందోళనకు గురవుతుండగా, చీకటి కారణంగా వాహనాలు మున్సిపల్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పులివెందులలోని పార్నపల్లి రోడ్డు నందు బి-మార్ట్ మొదలుకొని పార్నపల్లె రింగ్ రోడ్డు వరకు గత కొన్ని రోజులుగా వీధిలైట్లు వెలగక ప్రజలు మరియు పాదచారులు అనేక రకాలుగా ఇబ్బందులు పడడం జరుగుతుందని వీటి కారణంగానే ఇటీవల కాలంలో పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, రాత్రి పగలు తేడా లేకుండా అనేక వాహనాలు ప్రయాణించే ఈ దారిలో వీధిలైట్లు వెలగకపోవడం విచిత్రమని అనేకసార్లు మున్సిపల్ ఆఫీసులో ఫిర్యాదు చేసిన కనీసం మరమ్మత్తులు కూడా చేయలేని పరిస్థితి నెలకొన్నదని ఈ దారిలో వెలుగులు రావాలంటే ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొన్నదని, దురదృష్టకర సంఘటనలు చోటు చేసుకోక ముందే వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు పాలకులను మరియు అధికారులను ప్రాధేయ పడుతున్నారు.

# టిడిపిలోకి 50 కుటుంబాలు చేరిక

### కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన బిటెక్



వేంపల్లె **కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** స్థానిక సంస్థలు వస్తున్న నేపథ్యంలో వైసిపి, కాంగ్రెస్ పార్టీల నుండి టిడిపి పార్టీలోకి దాదాపు 50 కుటుంబాలు చేరారు. దీంతో పులివెందుల ఇన్ ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి ఆయా పార్టీల నుండి టిడిపిలోకి చేరిన నాయకులు, కార్యకర్తలు అందరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. సోమవారం స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో వైసీపీ నేతలు కటిక నాగరాజా, అలవలపాడు సంటెన్న, కాంగ్రెస్ నేత ఆరుశేర్ల సుబ్బరాయుడుతో పాటు వారి అనుచరులు టిడిపిలో చేరారు. ఈసందర్భంగా పులివెందుల టిడిపి ఇన్ చార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాలనను చూసి ఆయా పార్టీల నుండి టిడిపిలోకి చేరడం సంతోషంగా ఉందన్నారు. ఇటీవల ముస్లిం మైనార్టీ నేతలు పార్టీలో చేరగా ప్రస్తుతం బలిజ సంఘం, వడ్డేర సామాజిక వర్గం పార్టీలో చేరడం జరిగిందని చెప్పారు. కాపు సామాజిక వర్గంకు చెందిన 17 వ తేదిన చంద్ర (దిల్ మ్యాగే) అనుచరులు చేరుతున్నట్లు చెప్పారు. వైసిపి పార్టీ అనేది కనుమరుగు అవుతుందని చెప్పారు. గతంలో వైసిపికి 10 వేలు మెజార్టీ వస్తే ఈసారి జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపికి 10 వేలు మెజార్టీ వస్తుందని చెప్పారు. వేంపల్లెలో పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో పనులు చేపట్టుతున్నట్లు చెప్పారు. మదీనాపురం, పక్కీర్ పల్లెలో రోడ్లు వేసేందుకు దాదాపు 1కోటి 20 లక్షలతో ప్రణాళికలు వేసినట్లు చెప్పారు. చంద్రబాబు పాలనను చూసి వందల మంది టిడిపిలోకి చేరేందుకు మొగ్గు చూపుతున్నారు చెప్పారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వంలో నిర్లక్ష్యం కారణంగా ఆగిపోయిన పనులను పూర్తి చేస్తామని చెప్పారు. పాపాఘ్ని నదికి జిఎన్ఎస్ ఎస్ కాలువ ద్వారా లింక్ చేసి కాలేజి వాగు నుండి నీటి సరఫరా చేసి సస్యశ్యామలం చేస్తామని చెప్పారు. నియోజక వర్గం, వేంపల్లె మండల సమస్యలను కూడ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని చెప్పారు. స్థానిక సంస్థల్లో విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, హౌసింగ్ డైరెక్టర్ జగన్నాథరెడ్డి, డైరెక్టర్ గోగుల మల్లికార్జున తో పాటు పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలను పాటించండి.

### 15 నుంచి నో హెల్మెట్..... నో పెట్రోల్= ఎస్ఐ భక్తవత్సలం



తిరుపతి ప్రతినిధి **కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** ద్విచక్రవాహన చోదకులందరూ మోటారు వాహనాల చట్టం ప్రకారం తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఎస్సై భక్తవత్సలం కోరారు. సోమవారం ఆర్ సి పురం రక్షక భట్ట నిలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు అతి వేగంగా వాహనాలను నడపరాదని, పరిమితమైన వేగంతోనే వాహనాలు నడపాలని హెచ్చరించారు. 15వ తేదీ నుండి వాహన చోదకుడు, వెనకాల కూర్చుని ప్రయాణించే వ్యక్తి కూడా హెల్మెట్ ధరిస్తేనే పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ నింపుతారని, హెల్మెట్ లేకపోతే పెట్రోల్ పట్టరని ఆయన తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలను నడుపుతూ తనిఖీలలో పట్టుబడితే రూ 10 వేలు జరిమానాలు విధిస్తామన్నారు . వాహనాలు నడిపేవారు డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా..... రాష్ డ్రైవింగ్ చేసినా రూ. 5 వేల రూపాయలను జరిమానా విధించడంతోపాటు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించరాదని,విజ్ఞప్తి చేశారు. గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే వెంటనే ఆర్ సి పురం ఎస్సై 9440796731 ఫోన్ నెంబర్ కు ఫిర్యాదు చేయాలన్నారు.

కదిలించే వార్త
తెలుగు దినపత్రిక
మంగళవారం- 09 -డిసెంబర్ - 2025

## తిరుపతి సంస్కృత వర్సిటీ ఘటనపై పార్లమెంటులో
# ఎంపీ గురుమూర్తి వాయిదా తీర్మానం



తిరుపతి ప్రతినిధి **కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో చోటుచేసుకున్న లైంగిక వేధింపులు, బ్లాక్‌మెయిల్, డ్రగ్స్ ఘటనలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మద్దిల గురుమూర్తి లోక్‌సభలో అడ్జర్న్‌మెంట్ మోషన్ నోటీసు ఇచ్చారు. బీఈడీ మొదటి సంవత్సరం చదువుతున్న దళిత విద్యార్థినిని అదే వర్సిటీలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ లైంగికంగా వేధించడం, వ్యక్తిగత ఫోటోలు, వీడియోలను అడ్డుపెట్టుకుని బెదిరించడం అత్యంత హేయమని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాల్సిన గురువులే ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడటం తిరుపతి ప్రతిష్టకు దెబ్బతీస్తోందని ఎంపీ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, వర్సిటీ హాస్టల్ తనిఖీల్లో 20 గంజాయి ప్యాకెట్లు బయటపడటం క్యాంపస్ భద్రతా వ్యవస్థ పూర్తిగా విఫలమైందని ఎంపీ గురుమూర్తి అన్నారు. సెంట్రల్ యూనివర్శిటీలో విద్యార్థులు మాదకద్రవ్యాలకి లోనవడం అత్యంత ఆందోళనకరమని, దీనివల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆయన పేర్కొన్నారు. బాలికలు మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు రక్షణ లేకపోవడం అత్యంత బాధాకరమని సూచించారు. ఈ ఘటనలపై వెంటనే ఉన్నత స్థాయి విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, క్యాంపస్ భద్రతను బలోపేతం చేసి డ్రగ్-ఫ్రీ వాతావరణాన్ని ఏర్పరచాలని ఎంపీ గురుమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు.

# బి ఎల్ ఓ లు బాధ్యతాయుతంగా పనిచేయాలి

### ఓటర్ల మ్యాపింగ్ లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

### పులివెందుల ఆర్డీవో చిన్నయ్య





పులివెందుల **కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** బి ఎల్ వో లు ఓటర్ల మ్యాపింగ్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆర్డిఓ చిన్నయ్య హెచ్చరించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 129 పులివెందుల నియోజకవర్గం సంబంధించి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో చిన్నయ్య, తహసిల్దార్ నజీర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ రాముడు లు బూతు స్థాయి అధికారులు సూపర్వైజర్ల కు ఎస్.ఐ.ఆర్-2002 మ్యాపింగ్ కు సంబంధించి పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఎల్ఓ లు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. 2002 ఎస్.ఐ.ఆర్ ఓటర్ జాబితా తో తాజా ఓటరు జాబితాను కంపేర్ చేసుకుని ఓటర్ల జాబితాపై కామన్ గా ఉన్న పేర్లు పక్కన పెట్టాలని అన్నారు. తదుపరి రోజులలో 2002 తర్వాత కొత్తగా ఓటరు నమోదు చేసుకున్న ప్రతి ఓటరు వివరాలు క్షేత్రస్థాయిలో వెరిఫై చేయాల్సి ఉంటుందని అన్నారు. గతంలో ఉన్న పోలింగ్ కేంద్రాల పరిధి, ప్రస్తుత పోలింగ్ కేంద్రాల పరిధి మ్యాచ్ చేసుకుంటూ ఓటరు జాబితా వెరిఫై చేయాలని, ఈ ప్రక్రియను కంట్రోల్ టేబుల్ మ్యాపింగ్ అంటామని అన్నారు. 2002 లో జరిపిన ఎస్.ఐ.ఆర్ తరువాత ఓటు హక్కు సంక్రమించిన ప్రతి ఒక్కరి వివరాలు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ధృవీకరించాల్సి ఉంటుందని అన్నారు.ఓటర్ల మ్యాపింగ్ లో నిర్లక్ష్యం వహించిన బిఎల్ఓ లపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యాపింగ్ 25 శాతం లోపు ఉన్న వాళ్లకు ఛార్జ్ మెమో లు ఇవ్వడం జరుగుతుందని హెచ్చరించారు. ఫర్నిచర్ పనిచేయని బిఎల్ఓ లపై చర్యలు తప్ప ఉన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ వెంకట్ రెడ్డి,ఆర్ఐ షేక్షావల్లి, రెవెన్యూ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు మండలంలో
# ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



ఆత్మకూరు**కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** ఆత్మకూరు మండలంలోని పదహారు గ్రామ పంచాయతీలపై పదిహేడు విడత సామాజిక తనిఖీని ఈరోజు మండల రైతు వేదికలో నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద సంబందిత సంవత్సరానికి జరిగిన పనులపై తయారు చేసిన నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. ఫీల్డ్ సహాయకులపై మూడు వేల ఐదు వందల యాభై ఎనిమిది రూపాయలు, సాంకేతిక సహాయకులపై రెండు వేల మూడు వందల ముప్పై తొమ్మిది రూపాయలు, పంచాయతీరాజు శాఖ సహాయక ఇంజనీరుపై ఒక వేల రెండు వందల యాభై రూపాయలు ా మొత్తం ఏడు వేల ఒక వంద నలభై ఏడు రూపాయలను వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను తెలిపారు. ప్రతి గ్రామంలో కేటాయించిన కార్మిక బడ్జెట్‌ను పూర్తిగా వినియోగించాలని, నిబంధనలు కచ్చితంగా పాటించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి, నాణ్యత నియంత్రణ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రకు వెళ్లబోయే హాజీల
# సౌకర్యవంతమైన ఏర్పాట్లు ఎలా చేయాలి,

### ప్రతి హాజీకి ప్రభుత్వ సహకారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలి



పులివెందుల**కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ విజయవాడ కార్యాలయంలో సోమవారం, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ జనాబ్ షేక్ హసన్ బాషా సలహా సూచనల మేరకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో 5వ కమిటీ మీటింగ్ అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో హజ్ కమిటీ డైరెక్టర్లు జనాబ్ మహబూబ్ బాషా, జనాబ్ మీరా సాహెబ్, జనాబ్ మీర్జా అబీద్ హుస్సేన్ , జనాబ్ యన్. బాబా ఫక్రుద్దీన్ , జనాబ్ పఠాన్ ఖాదర్ ఖాన్ , సాహెబా ఎస్. రేష్మా పర్వీన్, జనాబ్ షేక్ అబ్దుల్ హుస్సేన్ , జనాబా సూరి మన్సూర్ అలీ , జనాబ్ సయ్యద్ షాజి సుల్తాన్ ముసవి , సాహేబా షేక్ జబీన్ ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2026 హజ్ యాత్రకు వెళ్లబోయే హాజీల కోసం మరింత సౌకర్యవంతమైన ఏర్పాట్లు ఎలా చేయాలి, 2025 హజ్ సందర్భంగా హాజీలకు ఎదురైన అసౌకర్యాలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు ఎలా తీసుకోవాలి, విజయవాడ ఎంబర్కేషన్ పాయింట్‌ను మరింత అభివృద్ధి చేయడం, ప్రతి హాజీకి ప్రభుత్వ సహకారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడం వంటి ముఖ్య అంశాలపై విస్తృతంగా చర్చలు జరిగాయి. అలాగే విజయవాడ హజ్ హౌస్ స్థలం మరియు భవన నిర్మాణం విషయంలో కూటమి ప్రభుత్వ సహకారాన్ని సాకారం చేసుకోవడంపై కూడా సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హజ్ కమిటీ మెంబెర్ మహబూబ్ భాషా కడప హజ్ హౌస్ పెండింగ్ పనులను వేగవంత చేయవలసిందిగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లావలసిందిగా కమిటీ నందు ఛైర్మెన్ హాసన్ భాషాని కోరడమైనది. ఈ కార్యక్రమంలో గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే జనాబ్ నసీర్ అహ్మద్ తమ విలువైన సమయాన్ని కేటాయించి, హజ్ సంబంధిత సమస్యలకు తగిన సూచనలు అందిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# గ్రామ అనుబంధ విభాగ కమిటీల సమావేశం

### వైసిపి పార్టీ సంస్థాగత బలోపేత లక్ష్యంగా ముందుకెళ్లాలి



పులివెందుల రూరల్ **కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** వైఎస్ఆర్సిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి , వైయస్ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు వై.యస్.ఆర్.సి.పి గ్రామ అనుబంధ విభాగాల కమిటీ పర్యవేక్షణ సోమవారం పులివెందుల మండలం కణం పల్లె గ్రామంలో వైకాపా కన్వీనర్ భాస్కర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వతం రెడ్డి, దశరథ నాయక్, నాయకుల ,కార్యకర్తల సమక్షంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి గ్రామ అనుబంధాల కమిటీ సమావేశాలు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడం, రాబోయే ఎన్నికలకు సన్నద్ధమవడం, వివిధ కార్యక్రమాలపై చర్చించడం వంటి అంశాలపై జరుగుతున్నాయని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో కమిటీలను కూడా వేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని అటల్ బిహారి
# వాజ్ పేయ్ విగ్రహ ఆవిష్కరణకు తరలిరండి...



**కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్, మాధవ్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన అనంతపురంలో జరుగనున్న మాజీ ప్రధాని, అజాత శత్రువు, భారత రత్న అటల్ బిహారి వాజపేయ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి జన సమీకరణకై ఈరోజు కణేకల్ మండల అధ్యక్షులు తిప్పేస్వామి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించడం జరిగినది.. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఇంచార్జి జీవి నాయడు అనంతపురం జిల్లా కార్యదర్శి కరణం నరేంద్ర స్వామి, కణేకల్ మండల కార్యదర్శి క్రాంతికుమార్, యాదవ్ మండల ఉపాధ్యక్షులు కే నాగరాజు, మాజీ అధ్యక్షులు మల్లయ్యచౌదరి, మండల మహిళా ఉపాధ్యక్షులు నేత్రవతి, సీనియర్ లీడర్ నాగభూషణం, జక్కల వాడికి ఎర్రిస్వామి,కార్యకర్తలు బసవరాజు, అనిలకుమార్,చంద్రకళ, మాల్యం నాగరాజు, మాల్యం మాబుసాబ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు మిగులు భూమి అడంగల్ లో చేర్చాలని...



కనేకల్ న్యూస్ **కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** కనేకల్ మండలం ఎమ్మార్వో సార్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది విషయం రైతులకు మిగులు భూమి అడంగల్ లో చేర్చాలని ఈరోజు ఎమ్మార్వో ఆఫీస్ దగ్గర ధర్నా చేసి వివరణ ఇవ్వడం జరిగింది. ఇందులో పాల్గొన్నవారు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కోరి నాగరాజు రైతు సంఘం మండల నాయకులు జై చంద్ర రెడ్డి కాకడీశర్మస్ రామంజి తదిత రైతులు పాల్గొన్నారు

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రత్యేక ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోండి= మార్కండేయ నాయుడు.

### ఆర్లీపురంలో ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం





తిరుపతి ప్రతినిధి **కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రతిభావంతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి వి మార్కండేయనాయుడు కోరారు. సోమవారం మండలంలోని మిట్టూరు గ్రామంలో ఉన్న భవిత స్కూల్ నందు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ లు మార్కండేయనాయుడు, జయవేలు లు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల ప్రతిభను పెంపొందించడానికి భవిత పాఠశాలలు భరోసాగా ఉన్నాయని పేర్కొన్నారు. దివ్యాంగుల కోసం కల్పిస్తున్న ప్రత్యేక సదుపాయాలపై అవగాహన కల్పించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా భవిత సెంటర్లోని ప్రత్యేక ప్రతిభావంతులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలైన వారికి ఎంఈఓ లు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐ ఈ ఆర్ పి లు మనోహర్, రాజేశ్వరి, లీలారాణి, ప్రత్యేక ప్రతిభావంతులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా పోలీసుల వాహనాల తనిఖీలు

### జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఆదేశాల మేరకు రహదారి భద్రతకు కృషి చేస్తున్న పోలీసులు

### రోడ్డు సేఫ్టీ నియమ ఉల్లంఘనలపై కఠిన చర్యలు






అనంతపురం, క్రైమ్,**కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** జిల్లా వ్యాప్తంగా రహదారి భద్రతను మెరుగుపరచడం, పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం, ట్రాఫిక్ నియమాలను కట్టుదిట్టం చేయడం లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా హైవేలు, పట్టణ ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు మరియు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్, హెల్మెట్/సీటు బెల్ట్ వినియోగం, మత్తులో డ్రైవింగ్ వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల సందర్భంగా పలు రకాల ఉల్లంఘనలు నమోదు కావడంతో సంబంధిత వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడినట్లు పోలీసులు తెలిపారు. నిబంధనలు పాటించని వాహనదారులపై జరిమానాలు విధించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు ఆయా తనిఖీల సందర్భంగా మాట్లాడారు. “ప్రజల ప్రాణాలు అమూల్యం. రోడ్డు భద్రత కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలి. హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగం, వేగ పరిమితులు, మత్తులో డ్రైవ్ చేయకూడదు వంటి నియమాలు ప్రజల కోసం తీసుకున్న భద్రతా చర్యలు మాత్రమే. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగనున్నాయి” అన్నారు.

**పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ...**

తప్పనిసరిగా లైసెన్స్, వాహన పత్రాలు వెంట తీసుకుని వెళ్లాలి హెల్మెట్/సీటు బెల్ట్ తప్పనిసరిగా వాడాలి వేగం, ప్రమాదకర డ్రైవింగ్, మత్తులో డ్రైవింగ్‌ను పూర్తిగా నివారించాలి ట్రాఫిక్ పోలీసుల సూచనలు, రోడ్డు సంకేతాలను కచ్చితంగా పాటించాలి జిల్లా పోలీసు శాఖ రోడ్డు భద్రతపై ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

# లారీ- ద్విచక్ర వాహనం ఢీ మహిళ మృతి





తొండూరు క్రైమ్ **కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** పులివెందుల నియోజకవర్గం తొండూరు మండలపరిదిలోని మదూరు గ్రామ సమీపంలో లారీ, ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో తొండూరు తహసీల్దార్ కార్యాలయం లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ జి కుమారి అక్కడికి అక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగ ఎస్ ఐ తన సిబ్బందితో హుటా హుటిన ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుందని తెలిపారు. విషయం తెలుసుకున్న తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది కన్నీటి పర్యంత మయ్యారు. పూర్తి వివరాలు తెలియాల్సిందని పోలీసులు తెలిపారు.

# శబరికి తరలివెళ్లిన అయ్యప్ప భక్తులు













అనంతపురం కదిలించే వార్త/ డిసెంబర్ 08 : కదిలించే వార్త చీఫ్ బ్యూరో అయినటువంటి రమేష్ కుమార్ అయ్యప్ప స్వామి దీక్ష పూర్తి చేసి సోమవారం స్థానిక ఫస్ట్ రోడ్ శివాలయం లో ఇరుముడులు కట్టి దేవాలయంలో గురుస్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అయ్యప్ప స్వామికి ముడుపులు చెల్లించేందుకు పలువురు భక్తులు స్వాములకు కానుకు ఇచ్చార్ను అయ్యప్ప భక్తులు శరణు ఘోష చెప్పుకుంటూ అనంతరం ప్రత్యేక వాహనాలలో శబరికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములకు శుభాకాంక్షలు తెలియజేశార్ను అయ్యప్ప స్వామి దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించాలని ప్రజలు కోరుకున్నార్నుఆ అయ్యప్ప ఆశీస్సులు మీపై మీ కుటుంబం పై ఎల్లవేళలా ఉండాలని మా పత్రికా యాజమాన్యం తరపున శుభాకాంక్షలు.

## నార్పల, బుక్కరాయసముద్రం మండలాల పరిధుల్లో
## మహిళల భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన

-జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఆదేశాల మేరకు శక్తి యాప్

- పనితీరు, ఉపయోగాలు, తదితర అంశాలపై అవగాహన చేసిన ఆయా శక్తి టీంలు, స్థానిక పోలీసులు



అనంతపురం, క్రైమ్, **కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** నార్పల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బుక్కరాయ సముద్రం మండలం ఇందిరా నగర్ లలో అవగాహన సదస్సులు నిర్వహించి సమాజంలో మహిళల భద్రత, మహిళల రక్షణ కు బి.ఎన్.ఎస్ లో ఉన్న చట్టాలను, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. సైబర్ క్రైమ్, సోషల్ మీడియా దుర్వినియోగం, మరియు ఆన్‌లైన్ భద్రత విషయాలపై వారికి విస్తృతమైన అవగాహన కల్పించారు. మొబైల్, సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే ప్రమాదాలను గుర్తించటం,



అనుమానాస్పద లింకులు లేదా అనుచిత సందేశాలు వచ్చినప్పుడు వెంటనే పోలీస్ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల గురించి వివరించారు. ఇలాంటి ఆపద సమయాల్లో తక్షణ సహాయం కోసం అందుబాటులో ఉన్న ముఖ్యమైన హెల్ప్‌లైన్ నంబర్లను గుర్తు చేశారు: డయల్ 100/112 (అత్యవసర సహాయం) చైల్డ్ లైన్ 1098 (పిల్లల రక్షణ) లి గృహ హింస 181 మహిళ వేధింపులు 1091 సైబర్ నేరాల టోల్ ఫ్రీ 1930 సైబర్ మిత్ర

## ఈనెల 10వతేదీ నుంచి
# 21వతేదీ వరకు టెట్ పరీక్ష

### జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్




అనంతపురం, కలెక్టరేట్, **కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** ఈనెల 10వతేదీ నుంచి 21వతేదీ వరకు టెట్ (ఏపీ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఇందుకోసం పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించిన అనంతరం ఏపీ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ పై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏపీ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ - అక్టోబర్ 2025ను ఈనెల 10వతేదీ నుంచి 21వతేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని, ఇందుకోసం జిల్లాలో 7 కేంద్రాలను ఎంపికచేయడం జరిగిందన్నారు. టెట్ పరీక్ష ప్రతిరోజు రెండు సెషన్లలో నిర్వహించడం జరుగుతుందని, సెషన్ వన్ ఉదయం 9:30 గంటల నుంచి 12 గంటల వరకు, సెషన్ 2 మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోలీస్, డిఆర్ఓ, సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ ఏపీ ఎస్పీడీసీఎల్, ఏపీఎస్ఆర్టీసీ, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని, పోలీస్ బందోబస్తు నిర్వహించాలని, అభ్యర్థుల కోసం ఆర్టీసీ వారు సరిపడే బస్సులు ఏర్పాటు చేయాలని, కేంద్రాలలో మెడికల్ అండ్ హెల్త్ వారు ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఆయా అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టాలని టెట్ పరీక్షలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, మల్లికార్జున, తిప్పేనాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, డిఈఓ ప్రసాద్ బాబు, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భారత క్రికెట్‌లో మెరిసిన నక్షత్రం కుమారి దీపికా

### కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు :మంత్రి సవిత

### దీపికా ప్రతిభకు గుర్తింపుగా ?2,00,116 ఆర్థిక ప్రోత్సాహం ప్రకటించిన మంత్రి







మడకశిర, **కదిలించే వార్త/ డిసెంబర్ 08 :** భారత క్రికెట్‌లో మెరిసిన నక్షత్రం కుమారి దీపికా అని మంత్రి సవితమ్మ గారు అన్నారు. మన జిల్లాకే గర్వకారణమైన భారత అంధ మహిళల క్రికెట్ టీమ్ కెప్టెన్ కుమారి దీపికా అంతర్జాతీయ స్థాయిలో భారత త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశ ప్రజల ప్రశంసలు అందుకుంటోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామితో కలిసి మడకశిరలో ఘనమైన అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సవితమ్మ, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, సినీ నటుడు సాయి కుమార్, కర్ణాటక స్వచ్ఛంద సంస్థల వ్యవస్థాపకులు మహంతేష్ హాజరయ్యారు. ముందుగా మడకశిర ప్రధాన వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించగా, అనంతరం కళాశాల మైదానంలో అభినందన సభ నిర్వహించారు. సభలో మంత్రి సవిత గారు మాట్లాడుతూ దీపికా మన అందరికీ ఆదర్శమన్నారు."దృష్టిలోపం ఉన్నప్పటికీ దృఢ సంకల్పం, క్రమశిక్షణ, పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని దీపికా నిరూపించింది. మడకశిర గర్వకారణమైన ఈ ముద్దుబిడ్డ ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రతిష్ఠను మరొకసారి నిలబెట్టింది" అని మంత్రి ప్రశంసించారు. దీపికా కృషికి గుర్తింపుగా ?2,00,116 ఆర్థిక ప్రోత్సాహాన్ని ప్రకటించారు.క్రీడాకారుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమారి దీపికా ప్రతిభను కలెక్టరు, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైతన్నకు శుభవార్త.. ఇక రూ.6000 కాదు, ఏకంగా రూ.9000 పొందవచ్చు!

దేశవ్యాప్తంగా ఉన్న రైతులకు త్వరలోనే కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పే సూచనలు కనిపిస్తున్నాయి. రైతులకు అందించే పీఎం కిసాన్ యోజన మొత్తాన్ని పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. మరి వచ్చే ఆర్థిక ఏడాదికి ప్రవేశపెట్టే బడ్జెట్‌లో దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు. రాబోయే కేంద్ర బడ్జెట్ రైతుల ముఖాల్లో చిరునవ్వులు తీసుకురావచ్చు. కేంద్ర ప్రభుత్వం తన అత్యంత ప్రతిష్టాత్మక పథకాలలో ఒకటైన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన (%పీ% కిసాన్ యోజన) మొత్తాన్ని గణనీయంగా పెంచాలని పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆలోచన ప్రకారం అంతా జరిగితే రైతులకు ఒక నుంచి రూ.6,000 నుండి రూ.9,000 లేదా అంతకంటే ఎక్కువకు పెరగవచ్చు. రాబోయే ఆర్థిక సంవత్సరం 2026-27 కోసం బడ్జెట్‌ను తయారు చేసే సుదీర్ఘమైన, సంక్లిష్టమైన ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఇది ఆర్థిక మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని బహుళ-స్థాయి ప్రక్రియ. ఆగస్టు-సెప్టెంబర్ నెలల్లో వరుస సమావేశాలు ప్రారంభమవుతాయి. నీతి ఆయోగ్, సంబంధిత మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రతినిధులు, వ్యవసాయ రంగంలోని అన్ని వాటాదారులతో సంప్రదింపులు జరుగుతాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 112 కింద తయారు చేయబడిన ఈ వార్షిక ఆర్థిక నివేదిక, రాబోయే సంవత్సరంలో ప్రభుత్వం ప్రజా నిధులను ఎక్కడ, ఎలా ఖర్చు చేస్తుందో నిర్ణయిస్తుంది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన ప్రారంభించినప్పటి నుండి, రైతులకు ఏటా రూ.6,000 ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ మొత్తాన్ని మూడు సమాన వాయిదాలలో నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎరువులు, విత్తనాలు, డీజిల్ ధరలు పెరిగినప్పటికీ సమ్మాన్ నిధి మొత్తం మారలేదు.

## వైట్ హౌస్ రహస్యాలు.. క్షిపణులు, అణు బాంబులు కూడా ఏమీ చేయలేవు..!

శ్వేత సౌధం, లేదా వైట్ హౌస్, అమెరికా అధ్యక్షుడి అధికారిక నివాసం. వాషింగ్టన్ డీసీలో ఉన్న ఈ అద్భుత భవనం 18 ఎకరాల్లో విస్తరించి, సకల సౌకర్యాలతో ఇంద్రభవనాన్ని తలపిస్తుంది. ప్రపంచంలోనే అత్యంత సురక్షితమైన ఈ నివాసంలో 132 గదులు, రహస్య సొరంగాలు, బంకర్లు ఉన్నాయి. దీని అజేయ భద్రత, చరిత్ర ప్రపంచవ్యాప్తంగా ఆకర్షిస్తుంది. శ్వేత సౌదం.. దీనినే వైట్ హౌస్ అని కూడా అంటారు. అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు కుటుంబసమేతంగా నివాసముండే అధికారిక భవనమే వైట్ హౌస్. సకల సౌకర్యాలతో ఇంద్రభవనాన్ని తలపించేలా వుంటుంది వైట్ హౌస్. ఇది అమెరికా రాజధాని వాషింగ్టన్ డిసి లోకి 1600 పెన్సిల్వేనియా అవెన్యూ ప్రాంతంలో వుంది. ఇది 18 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమైన విశాలమైన రాజభవనం. అంతేకాదు..ప్రపంచంలోనే అత్యంత సురక్షితమైన నివాసం ఇది. 1800 నుండి అమెరికా అధ్యక్షుడి అధికారిక నివాసంగా ఉన్న ఈ వైట్‌హౌస్ భవనం ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ఒక ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. వైట్ హౌస్ అనేది ఆరు అంతస్తుల భవనం. బేస్మెంట్లో రెండు అంతస్తులు ఉన్నాయి. దీనిని ప్రెసిడెంట్ హౌస్, ప్రెసిడెంట్ ప్యాలెస్, ఎగ్జిక్యూటివ్ మాన్షన్ అని కూడా పిలుస్తారు. దీనిని 1901లో అప్పటి అధ్యక్షుడు థియోడర్ రూజ్వెల్ట్ వైట్ హౌస్ గా పేరు మార్చారు. దీనిలో 132 గదులు, 32 బాత్రూమ్‌లు, 412 తలుపులు, 8 మెట్ల మార్గాలు, 3 లిఫ్టులు, 147 కిటికీలు ఉన్నాయి. ఈ ఇంటి భద్రతను నిరంతరం అతి జాగ్రత్తగా నిర్వహిస్తారు. బుల్లెట్‌లు, క్షిపణులు వంటివి కూడా దీనిని ధ్వంసం చేయలేవు. అంతేకాదు.. అణు దాడి జరిగినప్పుడు కూడా దానిని రక్షించడానికి బంకర్‌లను నిర్మించారు. వైట్ హౌస్ 8 ఎకరాలలో విస్తరించి ఉంది. 55,000 చదరపు అడుగుల అంతస్తు స్థలం ఉంది. మిగిలిన ప్రాంతంలో తోటలు, స్విమ్మింగ్ పూల్స్, టెన్నిస్, బాస్కెట్‌బాల్ కోర్టులు, జాగింగ్ ట్రాక్‌లు, ఇతర సౌకర్యాలు ఉన్నాయి. ప్రతి గదిని ఎప్పుడూ అందమైన పూలతో అలంకరించి ఉంచుతారు.. ఒక ప్రైవేట్ సినిమా స్క్రీనింగ్ థియేటర్, బౌలింగ్ అల్లే కూడా ఉన్నాయి. ఇది నిజంగా విలాసవంతమైన అనుభూతిని కలిగిస్తుంది. ఇందులో స్టేట్ డైనింగ్ రూమ్, ఓవల్ ఆఫీస్, మ్యాప్ రూమ్ వంటి అనేక ప్రత్యేక గదులు ఉన్నాయి. ఇందులో రెండు ఫార్మల్ గార్డెన్‌లు, కిచెన్ గార్డెన్, పిల్లలు ఆడుకోవడానికి ఒక ప్రత్యేక పిల్లల గార్డెన్ కూడా ఉన్నాయి. వైట్ హౌస్ జిమ్‌తో సహా అన్ని ఆధునిక సౌకర్యాలతో అమర్చబడి ఉంది.వైట్ హౌస్‌కు రెండు సొరంగాలు, ఒక రహస్య బంకర్ నిర్మించబడ్డాయని కూడా చెబుతారు. ఒక సొరంగం ట్రెజరీ భవనానికి దారితీస్తుంది. మరొకటి సౌత్ లాన్ వైపు వెళుతుంది. ఇది మెరైన్ వన్ హెలికాప్టర్‌కు ల్యాండింగ్‌ను అందిస్తుంది. వైట్ హౌస్‌లో సిట్యువేషన్ రూమ్ అని పిలువబడే బంకర్ కూడా ఉంది. ఇది ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించేందుకు వీలుగా ఉంటుంది. ఈ బంకర్‌లు బలమైన ఇనుముతో తయారు చేయబడి ఉన్నాయని, అవి ఏలాంటి దాడినైనా తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటాయని చెబుతారు. వైట్ హౌస్ భద్రత అజేయమైనది.

## రైల్వే ప్రయాణికులకు భారీ గుడ్‌న్యూస్.. ఇక రైలులో ఈ సదుపాయం కూడా!



భారతీయ రైల్వే తాజాగా బెడ్ షీట్ల సేవలో భారీ మార్పు చేసింది. 2026 జనవరి 1 నుంచి నాన్-ఏసీ స్లీపర్ కోచ్ ప్రయాణికులకు బెడ్ షీట్లు, దిండ్లు అందుబాటులోకి వస్తాయి. ఇది చెన్నై డివిజన్‌లోని సదరన్ రైల్వే ప్రాంతంలో.. చాలా మంది రైలులో ప్రయాణించడానికి ఇష్టపడతారు. రైళ్లు తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తాయి. మీరు ఏసీ కోచ్‌లో ప్రయాణిస్తే ఎటువంటి సమస్య లేదు. భారతీయ రైల్వేలు మీకు బెడ్‌రోల్స్‌ను అందిస్తాయి. అయితే దీనిపై అనేక ప్రశ్నలు తలెత్తుతాయి. స్లీపర్ క్లాస్‌లో బెడ్‌రోల్ పొందడం సాధ్యమేనా? మీకు బెడ్‌రోల్ లభించకపోతే ఏమి చేయాలి? రైల్వే అందించే బెడ్‌రోల్‌లో 2 దిండ్లు, 2 బెడ్‌షీట్లు, 1 దుప్పటి ఉంటాయి. ఒక టవల్ కూడా అందిస్తారు. ఫాస్ట్ , సెకండ్ , థర్డ్ అన్ని కోచ్‌లకు ఈ బెడ్‌రోల్ ఇస్తారు. అయితే, గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్‌లో బెడ్‌రోల్ పొందడానికి మీరు అదనంగా రూ. 25 చెల్లించాలి. ఒక వార్తా సంస్థ ప్రకారం, స్లీపర్ క్లాస్ ప్రయాణీకులకు బెడ్ రోల్ లభిస్తుంది. అయితే, ఈ సౌకర్యం కొన్ని రైళ్లలో మాత్రమే అందుబాటులో ఉంది. అలాంటప్పుడు ప్రయాణీకులు అదనపు ఖర్చును భరించాల్సి ఉంటుంది. భారతీయ రైల్వే తాజాగా బెడ్ షీట్ల సేవలో భారీ మార్పు చేసింది. 2026 జనవరి 1 నుంచి నాన్-ఏసీ స్లీపర్ కోచ్ ప్రయాణికులకు బెడ్ షీట్లు, దిండ్లు అందుబాటులోకి వస్తాయి. ఇది చెన్నై డివిజన్‌లోని సదరన్ రైల్వే ప్రాంతంలో మొదటిసారిగా అమలు చేయనున్నారు. ఇక్కడ ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని డిమాండ్ మేరకు పొందుతారు. ఇది వారి ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతం చేస్తుంది. చలికాలంలో నాన్-ఏసీ స్లీపర్ కోచ్‌లో ప్రయాణించేవారు బెడ్‌షీట్లను అద్దెకు తీసుకుంటారు. 2023-24లో ఈ విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలుచెయ్యగా ప్రయాణికుల నుంచి భారీ స్పందన వచ్చింది. ఇప్పుడు మరో ప్రశ్న ఏంటంటే.. రైలు కోచ్‌లో ఆ బెడ్ షీట్ అద్దె ఎంత ఉంటుంది అని. దీని రైల్వే శాఖ.. ఫిక్స్‌డ్ ఛార్జీలు పెట్టింది. బెడ్ షీట్ కావాలంటే రూ.20 చెల్లించాలి. దిండు కవర్ కావాలంటే రూ.30 చెల్లించాలి. రెండూ కావాలంటే రూ.50 చెల్లించాల్సి ఉంటుందని సమాచారం. వీటిని రాత్రి ఇస్తారు. మార్నింగ్ తిరిగి తీసుకుంటారు. ఇవి ఉచితం కాదు. వీటిని పొందాలంటే.. తప్పనిసరిగా టికెట్ చూపించాలి. ఎందుకంటే.. రిజర్వేషన్ లేని జనరల్ బోగీల్లో ప్రయాణించేవారికి ఈ సేవ అందుబాటులో లేదు.

## జియో నుంచి మూడు అద్భుతమైన ప్లాన్స్.. ఈ ప్రయోజనాలు ఉచితమే!




ఈ ప్లాన్‌లు మీ అవసరాలకు అనుగుణంగా వేర్వేరు ధరల వద్ద వస్తాయి. మీకు అన్ని విధాలుగా ప్రయోజనకరంగా ఉండే మూడు అద్భుతమైన జియో ప్లాన్‌ల గురించి తెలుసుకుందాం. ఇవి తగినంత రోజువారీ డేటా, అపరిమిత కాలింగ్, ఉచిత ప్రయోజనాలను అందిస్తాయి.. రిలయన్స్ జియో తన కస్టమర్ల కోసం వివిధ రకాల రీఛార్జ్ ప్లాన్‌లను అందిస్తుంది. కంపెనీ తన కస్టమర్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రీపెయిడ్ ప్లాన్‌లను తన పోర్ట్‌ఫోలియోలో చేర్చింది. ఈ ప్లాన్‌లు వారి అవసరాల ఆధారంగా డేటా, వాలిడిటీ, ఉచిత ప్రయోజనాలను అందిస్తాయి. ఈ ప్లాన్‌లు మీ అవసరాలకు అనుగుణంగా వేర్వేరు ధరల వద్ద వస్తాయి. మీకు అన్ని విధాలుగా ప్రయోజనకరంగా ఉండే మూడు అద్భుతమైన జియో ప్లాన్‌ల గురించి తెలుసుకుందాం. ఇవి తగినంత రోజువారీ డేటా, అపరిమిత కాలింగ్, ఉచిత ప్రయోజనాలను అందిస్తాయి.

**జియో రూ.449 ప్లాన్:**

జియో తన కస్టమర్లకు రూ.449 ప్లాన్‌ను అందిస్తోంది. ఈ ప్లాన్ 28 రోజుల పాటు రోజుకు 3%+దీ% డేటాను అందిస్తుంది. ఈ ప్లాన్ కింద కంపెనీ మొత్తం 84%% డేటాను అందిస్తోంది. అపరిమిత కాలింగ్, రోజుకు 100 %హామీ%లు కూడా ఉన్నాయి. ఈ ప్లాన్‌లో జియోహోమ్ 2 నెలల ఉచిత ట్రయల్ కూడా ఉంది. అదనంగా మొబైల్/టీవీ కోసం 3 నెలల జియోహాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ కూడా ఉంది. ఇంకా, ఈ ప్లాన్‌లో గూగుల్ జెమిని ప్రోకు 18 నెలల సబ్‌స్క్రిప్షన్ కూడా ఉంది. ఈ ప్లాన్ కింద అర్హత ఉన్న వినియోగదారులకు కంపెనీ అపరిమిత 5%+% డేటాను కూడా అందిస్తోంది.

**రూ.1199 ప్లాన్:**

జియో తన కస్టమర్ల కోసం అద్భుతమైన రూ.1199 ప్లాన్‌ను అందిస్తోంది. ఈ ప్లాన్ 84 రోజుల చెల్లుబాటుతో ఉంటుంది. కంపెనీ రోజుకు 3% డేటాను అందిస్తుంది. మొత్తం చెల్లుబాటు కాలానికి మొత్తం 252%+దీ% డేటాను అందిస్తుంది. ఈ ప్లాన్‌తో అపరిమిత కాలింగ్, రోజుకు 100 లు కూడా ఉన్నాయి. జియోహోమ్ 2 నెలల ఉచిత ట్రయల్ కూడా ఈ ప్లాన్‌లో చేర్చింది. మొబైల్, టీవీ కోసం 3 నెలల జియోహాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ కూడా చేర్చింది. మీ జియో సబ్‌స్క్రిప్షన్‌తో, క్విజ్ క్రెస్ట్‌లో ఉత్తేజకరమైన క్విజ్‌లను ప్లే చేయడం మర్చిపోవద్దు. కంపెనీ 50%+దీ జీఅశీూఅజశ్రీశీబ%ం నిల్వను కూడా అందిస్తోంది. గూగుల్ జెమిని ప్రోకు 18 నెలల సబ్‌స్క్రిప్షన్ కూడా ఈ ప్లాన్‌లో చేర్చింది.

**నెట్‌ఫ్లిక్స్‌తో జియో రూ. 1799 ప్లాన్:**

జియో తన కస్టమర్ల కోసం అద్భుతమైన రూ.1799 ప్లాన్‌ను అందిస్తోంది. ఈ ప్లాన్ 84 రోజుల చెల్లుబాటుతో పాటు రోజుకు 3% డేటాను అందిస్తుంది. ఈ ప్లాన్‌లో కంపెనీ అపరిమిత 5% కాలింగ్ ప్రయోజనాలను కూడా అందించింది. ఇది రోజుకు 100 లను కూడా అందిస్తుంది. ఈ ప్లాన్‌లో జియోహోమ్ 2 నెలల ఉచిత ట్రయల్ కూడా చేర్చింది. మొబైల్/టీవీ కోసం 3 నెలల జియోహాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ కూడా చేర్చబడింది. కంపెనీ 50% జియోఏఐక్లౌడ్ స్టోరేజ్‌ను కూడా అందిస్తోంది. ఈ ప్లాన్‌లో ప్రాథమిక నెట్‌ఫ్లిక్స్ సబ్‌స్క్రిప్షన్ కూడా ఉంది. ఈ విధంగా కంపెనీ తన ప్రీపెయిడ్ పోర్ట్‌ఫోలియోలో ఈ మూడు చాలా సరసమైన ప్లాన్‌లను తన కస్టమర్లకు అందిస్తుంది. ఈ ప్లాన్‌లతో రీఛార్జ్ చేయడానికి మీరు యాప్ లేదా కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. ప్లాన్‌తో రీఛార్జ్ చేయడానికి మీరు సమీపంలోని స్టోర్‌ను కూడా సందర్శించవచ్చు.

## ఉద్యోగులు ఆందోళన చెందవద్దు.. ఈపీఎఫ్‌వో కీలక వివరణ జారీ!




ఈ అసౌకర్యానికి ఈపీఎఫ్‌వో ??విచారం వ్యక్తం చేసింది. సభ్యుల సేవలను మరింత సజావుగా చేయడానికి సాంకేతిక మెరుగుదలలు చేస్తున్నట్లు తెలిపింది. క్లెయిమ్ దాఖలు, ఖాతా యాక్సెస్ వంటి లక్షణాలకు అప్‌గ్రేడ్‌లు కూడా ఉన్నాయి. %జ్ఞూఖీ% ఇటీవలే అనేక కొత్త ఫీచర్లను.. సిస్టమ్‌లో ప్రధాన అప్‌గ్రేడ్ జరుగుతున్నందున సెప్టెంబర్, అక్టోబర్ 2025కి సంబంధించిన పీఎఫ్ వివరాల పాస్‌బుక్ ఎంట్రీలు కొన్ని రోజుల పాటు కనిపించకపోవచ్చు అని ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ పేర్కొంది. అనేక మంది వినియోగదారులు తమ పాస్‌బుక్‌లలో వివరాలు మిస్ అయ్యాయని ఫిర్యాదు చేసిన తర్వాత ?%?ఈ వివరణ జారీ చేసింది.

**లెడ్జర్ అప్‌గ్రేడ్ కారణంగా ఆలస్యం:**

ఈపీఎఫ్ఓ తన ఎలక్ట్రానిక్ చలాన్-కమ్-రిటర్న్ లెడ్జర్ పోస్టింగ్ సిస్టమ్‌ను అప్‌డేట్ చేస్తున్నట్లు పేర్కొంది. ఈ కారణంగా ఈ రెండు నెలల పాస్‌బుక్ ఎంట్రీలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు సంస్థ తెలిపింది. అప్‌డేట్ రెండు రోజుల్లో పూర్తవుతుందని, ఎంట్రీలు స్వయంచాలకంగా అందరికి కనిపిస్తాయని సంస్థ పేర్కొంది. ఉద్యోగులు ఏ మాత్రం ఆందోళన చెందవద్దని సూచించింది. ఇప్పటికే కొందరికి ఎంట్రీలు కనిపించినా.. కనిపించని వారు టెన్షన్ పడవద్దని, వారికి కూడా రెండు రోజుల్లోనే కనిపిస్తాయని ఈపీఎఫ్ఓ తెలిపింది. ఈ అసౌకర్యానికి ఈపీఎఫ్‌వో ??విచారం వ్యక్తం చేసింది. సభ్యుల సేవలను మరింత సజావుగా చేయడానికి సాంకేతిక మెరుగుదలలు చేస్తున్నట్లు తెలిపింది. క్లెయిమ్ దాఖలు, ఖాతా యాక్సెస్ వంటి లక్షణాలకు అప్‌గ్రేడ్‌లు కూడా ఉన్నాయి.

**కొత్త ఫీచర్లు:**

ఇటీవలే అనేక కొత్త ఫీచర్లను ప్రవేశపెట్టింది. ఇవి వినియోగదారులకు ఎంతో సహాయపడతాయి.

**డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్:** ఇప్పుడు పెన్షనర్లు తమ ఇళ్ల నుండే ముఖ ధృవీకరణ ద్వారా తమ జీవిత ధృవీకరణ పత్రాన్ని సమర్పించవచ్చు.

**ఆన్‌లైన్ ప్రొఫైల్ అప్‌డేట్:** సభ్యులు, యజమానులు యూనిఫైడ్ పోర్టల్‌లోని కొత్త ఫీచర్ ద్వారా ఆన్‌లైన్ ప్రొఫైల్ అప్‌డేట్ అభ్యర్థనలను దాఖలు చేయవచ్చు.

**పాస్‌బుక్ లైట్:** పాస్‌బుక్ లైట్ అనేది అదనపు వెబ్‌సైట్‌ను సందర్శించాల్సిన అవసరం లేకుండానే సహకారాలు, ఉపసంహరణలు, బ్యాలెన్స్‌ల సారాంశాన్ని అందించే ఒక సాధారణ వీక్షణ.

పాస్‌బుక్ అప్‌డేట్ అయిన తర్వాత ఎలా తనిఖీ చేయాలి?

సభ్యుల ఈ- సర్వీస్ పోర్టల్‌ను సందర్శించండి.

పాస్‌వర్డ్, ఓటీపీతో లాగిన్ అవ్వండి.

డాష్‌బోర్డ్‌లో 'పాస్‌బుక్ లైట్' ఎంచుకోండి.

మీ సహకారాలు, బ్యాలెన్స్‌ను వీక్షించండి లేదా డౌన్‌లోడ్ చేసుకోండి.

సెప్టెంబర్-అక్టోబర్ ఎంట్రీలు ఎప్పుడు కనిపిస్తాయి?

లెడ్జర్ అప్‌గ్రేడ్ పూర్తయిన తర్వాత సెప్టెంబర్, అక్టోబర్ 2025 కి సంబంధించిన అన్ని ఎంట్రీలు పాస్‌బుక్‌లో స్వయంచాలకంగా అప్‌డేట్ అవుతాయి. ఖాతాదారులు తమ పీఎఫ్ బ్యాలెన్స్‌ను ఖచ్చితంగా తనిఖీ చేయవచ్చు.

## 2026లో బ్యాంకుల పని దినాలు వారానికి 5 రోజులేనా?

ప్రతి శనివారం, ఆదివారం బ్యాంకులను మూసివేయాలని బ్యాంక్ అసోసియేషన్ సూచించింది. దీని వలన ఉద్యోగులు సోమవారం నుండి శుక్రవారం వరకు పని చేయాల్సి వస్తుంది. అయితే, స్థిరమైన వారపు పనివేళలను నిర్వహించడానికి, ఉద్యోగులు వారంలోని ఐదు.. బ్యాంకు పనిదినానికి వారానికి 5 రోజులు ఉండాలని గత కొన్ని రోజులుగా డిమాండ్ చేస్తున్నాయి బ్యాంకు సంఘాలు. అయితే ఈ విధానం 2026 సంవత్సరంలో అమలు అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఈ ప్రతిపాదన ఇప్పుడు అధికారికంగా ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (%×దీూ%) అన్ని శనివారాలను బ్యాంకు సెలవు దినాలుగా ప్రకటించాలని ప్రతిపాదనను సమర్పించిందని ఆర్థిక మంత్రిత్వ శాఖ జూలై 28, 2025న లోక్‌సభకు తెలియజేసింది. దీని ఫలితంగా బ్యాంకింగ్ రంగంలో ఐదు రోజులు పనిచేయడం జరుగుతుంది. బ్యాంకులు సోమవారం నుండి శుక్రవారం వరకు తెరిచి ఉంటాయి. అన్ని శనివారాలు, ఆదివారాల్లో మూసి ఉంటాయి. ఇది అమలు అయితే బ్యాంకు సిబ్బంది వారానికి ఐదు రోజులు మాత్రమే పని చేయాల్సి ఉంటుంది. దీనిపై ఎంతో కాలంగా డిమాండ్ చేస్తుండగా, వచ్చే ఏడాది అమలులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని బ్యాంకింగ్ సిబ్బంది చెబుతున్నారు.

**5 రోజుల బ్యాంకింగ్ వారపు ప్రతిపాదన ఏమిటి?**

ప్రతి శనివారం, ఆదివారం బ్యాంకులను మూసివేయాలని బ్యాంక్ అసోసియేషన్ సూచించింది. దీని వలన ఉద్యోగులు సోమవారం నుండి శు



క్రవారం వరకు పని చేయాల్సి వస్తుంది. అయితే, స్థిరమైన వారపు పనివేళలను నిర్వహించడానికి, ఉద్యోగులు వారంలోని ఐదు రోజులూ దాదాపు 40 నిమిషాలు ఎక్కువగా పని చేయవచ్చు. ఇది కస్టమర్ సేవపై ప్రభావం చూపదని యూనియన్ చెబుతోంది. ఇది ఉద్యోగుల మనోధైర్యాన్ని పెంచుతుందని, పని నాణ్యతను మెరుగుపరుస్తుందని, బ్యాంకింగ్ రంగంలో నాణ్యత మెరుగుపడుతుందని %ూ×దీూజ% విశ్వసిస్తోంది.

**ఇంతకీ ఏం జరిగింది?**

ఈ ఏడాది మార్చిలో ఐబిఎ, ప్రధాన బ్యాంకు సంఘాలు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ ఒక ఉమ్మడి నోట్‌పై సంతకం చేయడంతో ఐదు రోజుల పని దినం కోసం డిమాండ్ ఊపందుకుంది. జూలై 2025లో ఈ ప్రతిపాదన ఇంకా పరిశీలనలో ఉందని ఆర్థిక మంత్రిత్వ శాఖ పార్లమెంటుకు తెలియజేసింది. 2025%-%26 ఆర్థిక సంవత్సరంలో ఈ ప్రతిపాదన అమలు అయ్యే అవకాశం లేదని మంత్రిత్వ శాఖ ఏప్రిల్ 2025లో సూచించింది. ఈ మార్పుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్‌బిఐ రెండింటి నుండి ఆమోదం అవసరం, ఇంకా ఎవరూ తుది ఆమోదం ఇవ్వలేదు.

**ప్రస్తుతం బ్యాంకింగ్ వ్యవస్థ ఎలా ఉంది?**

నేడు బ్యాంకులు ఆగస్టు 2015లో అమలు చేయబడిన నిబంధనల ప్రకారం పనిచేస్తున్నాయి. ఈ నిబంధనల ప్రకారం, ప్రతి నెల రెండవ, నాల్గవ శనివారాల్లో బ్యాంకులు మూసి ఉంటున్నాయి. ఇతర శనివారాల్లో, బ్యాంకులు తెరిచి ఉంటాయి.

**సిబ్బంది కొరత వల్లే ఆలస్యమైందా?**

ఈ ప్రతిపాదన ఆగిపోవడానికి సిబ్బంది కొరత కారణం కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. కాంగ్రెస్ ఎంపీ కె.సి. వేణుగోపాల్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 96% ఉద్యోగాలు భర్తీ అయ్యాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. మిగిలిన ఖాళీలు సాధారణ పదవీ విరమణ, ఇతర క్రమరహిత కారణాల వల్ల ఉన్నాయి. అయితే, వీటిని ప్రతిపాదనకు అడ్డంకిగా పరిగణించరని తెలిపింది.

**5 రోజుల బ్యాంకింగ్ వారం ఎప్పుడు ప్రారంభమవుతుంది?**

ఈ ప్రతిపాదనను అమలు చేయడానికి ఇంకా ఎటువంటి గడువును నిర్ణయించలేదు. ఈ ప్రతిపాదన ప్రభుత్వం, ఆర్బీఐ రెండింటి సమీక్షలో ఉంది.

# స్టార్ ఫిలిం మేకర్ కి క్లారిటీ లేదా..?



బాలీవుడ్ గత కొంతకాలంగా తీవ్రమైన గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఎంతోమంది స్టార్ ఫిలిం మేకర్లు వరుస పరాజయాలను చవిచూస్తున్నారు. ఒకప్పుడు ఇండస్ట్రీ హిట్ అందించిన నిర్మాతలు కూడా ఇప్పుడు మినిమం సక్సెస్ సినిమాలను నిర్మించలేకపోతున్నారు. కేవలం నిర్మాతలే కాకుండా దర్శకులు కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. బాలీవుడ్ ప్రేక్షకులు ఎలాంటి సినిమాలను ఇష్టపడుతున్నారో అర్థం కావడం లేదు అనేది బాలీవుడ్ ఫిలిం మేకర్స్ కంప్లైంట్. ఈ నేపథ్యంలో పలువురు బాలీవుడ్ ఫిలిం మేకర్స్ ఎప్పటికప్పుడు కొత్త ప్రయోగాలను చేయకుండా సేఫ్ జోన్ లో సినిమాలు చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే తమకు కలిసి వచ్చిన కాంబినేషన్లను వెతుక్కుంటున్నారు. అంతేకాకుండా ఒక కాంబినేషన్ హిట్ అయితే అదే కాంబినేషన్లో మరిన్ని సినిమాలు చేయాలని భావిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ తో దిల్ రాజు.. బ్లాక్ బస్టర్ ప్లాన్..! కరణ్ జోహార్ బాలీవుడ్ లో.... కరణ్ జోహార్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఆయన బాలీవుడ్ ఫిలిం మేకర్ అయినప్పటికీ సినిమాల గురించి తెలిసిన ప్రతి ఒక్క ఇండియన్ కి ఆయన సుపరిచితుడు. కేవలం నిర్మాతగానే కాకుండా దర్శకుడిగా, టాక్ షో హోస్ట్గా కూడా ఆయన అందరికీ తెలిసిన వాడే. ఆయన దర్శకత్వంలో సినిమా వచ్చి చాలా కాలమైంది.. ఆయన హిట్ సినిమా తీసి చాలా రోజులైంది అంటూ ఆయన సన్నిహితులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు స్టార్స్ తమ వారసులను కరణ్ జోహార్ బ్యానర్లో పరిచయం చేసేందుకు క్యూ కట్టేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కరణ్ జోహార్ బ్యానర్ లో సినిమా చేస్తే ఏ మేరకు సక్సెస్ దక్కుతుందో ఇప్పటికే అందరికీ అర్థమయింది. కొందరు మాత్రం కరణ్ జోహార్ మళ్ళీ ఫామ్ లోకి వస్తాడు ప్రేక్షకుల అభిరుచి తగ్గట్లుగా సినిమాలను నిర్మిస్తాడు. ఆయన దర్శకత్వంలో కూడా మరిన్ని సినిమాలు వస్తాయి అని ఆశతో ఎదురుచూస్తున్నారు. కరణ్ జోహార్ మాత్రం నిర్మాతగానే ఎక్కువ సినిమాలు చేస్తూ ముందుకు వెళుతున్నాడు. ట్రోలర్స్ కి రష్మిక కౌంటర్.. ఇప్పుడైనా? కార్తీక్ ఆర్యన్ హీరోగా... సాధారణంగా ఒక నిర్మాత ఒకేసారి మూడు నాలుగు సినిమాలను నిర్మిస్తాడు. కానీ ఆ మూడు నాలుగు సినిమాలను ఒకే హీరోతో నిర్మించే సాహసం మాత్రం చేయడు, కానీ కరణ్ జోహార్ అదే పని చేస్తున్నాడు. బాలీవుడ్ యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్ తో కరణ్ జోహార్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలకు ప్లాన్ చేస్తున్నాడు. ఇప్పటికే వీరి కాంబినేషన్లో తూ మేరీ మై తేరా మై తేరా తు మేరీ సినిమా పూర్తయింది. ఆ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఆ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా కార్తీక్ ఆర్యన్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కరణ్ జోహార్ బ్యానర్లో మరిన్ని సినిమాలు చేసే అవకాశం ఉందని చెప్పుకొచ్చాడు. ఇప్పటికే నాగ్ జిల్లా అనే సినిమాలో కరణ్ జోహార్ నిర్మాణంలో కార్తీక్ ఆర్యన్ నటిస్తున్నాడు. ఆ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. రెండు సినిమాలు కరణ్ జోహార్ బ్యానర్లో ఇప్పటికే చేసిన కార్తీక్ ఆర్యన్ మరో సినిమాకు సైన్ చేశాడు అంటూ బాలీవుడ్ వర్గాల ద్వారా సమాచారం అందుతుంది. స్పిరిట్ హీరోయిన్ ఎనర్జీ బూస్టర్ ఇదే... ఒకేసారి మూడు సినిమాలతో కరణ్ జోహార్ కార్తీక్ ఆర్యన్ హీరోగా కరణ్ జోహార్ నిర్మాణంలో రూపొందబోతున్న మూడవ సినిమాకి సందీప్ మోడీ దర్శకత్వం వహించబోతున్నాడు. ఇప్పటి వరకు కరణ్ జోహార్ బ్యానర్లో కార్తీక్ ఆర్యన్ చేసిన రెండు సినిమాలు రొమాంటిక్ ఎంటర్టైనర్ మూవీస్ కాగా సందీప్ మోడీ దర్శకత్వంలో చేయబోతున్న సినిమా పూర్తి స్థాయి యాక్షన్ చిత్రంగా ఉంటుందని బాలీవుడ్ వర్గాల ద్వారా సమాచారం అందుతుంది. కరణ్ జోహార్ ఈ ప్రాజెక్టు పట్ల చాలా ఆసక్తిగా ఉన్నాడట, అందుకే కార్తీక్ ఆర్యన్ తో నిర్మించిన మొదటి రెండు సినిమాలు విడుదల కాకముందే ఈ సినిమాను పట్టాలెక్కించేందుకు రెడీ అయ్యాడని సమాచారం అందుతుంది. సాధారణంగానే కరణ్ జోహార్ వంటి నిర్మాత బ్యానర్లో వచ్చే యాక్షన్ సినిమా పట్ల ప్రేక్షకుల్లో ఒకింత ఆసక్తి ఉంటుంది. ఆయన తన జోనర్ కి దూరంగా జరిగి ఈ సినిమా చేస్తున్నాడు అందుకే ఈ సినిమా సక్సెస్ అవుతుందనే ధీమా వ్యక్తం అవుతుంది. మరి కొందరు మాత్రం కరణ్ జోహార్ కి ఏ సినిమా



# ట్రోలర్స్ కి రష్మిక కౌంటర్.. ఇప్పుడైనా?

రష్మిక మందన్న.. కన్నడ ముద్దుగుమ్మ అయినప్పటికీ టాలీవుడ్ లో సత్తా చాటి నేడు పాన్ ఇండియా హీరోయిన్గా చలామణి అవుతోంది. అది తక్కువ సమయంలోనే నాలుగు వేల కోట్లకు పైగా కలెక్షన్స్ బాక్స్ ఆఫీస్ వద్ద రాబట్టి.. స్టార్ హీరోలను సైతం ఆశ్చర్యపరిచింది. ముఖ్యంగా ఏ ఒక్క హీరోకి సాధ్యం కానీ అతి కష్టమైన రికార్డులను బ్రేక్ చేసి అందరి చేత ప్రశంసలు అందుకుంది రష్మిక.. తన నటనతోనే కాదు అందంతో ఆకట్టుకుంటూ నేషనల్ క్రష్ గా పేరు సొంతం చేసుకుంది. ఇకపోతే ఒకవైపు సినిమాలు మరొకవైపు సోషల్ మీడియాలో బిజీబిజీగా గడిపేస్తున్న ఈమె.. తన ఫోటోలను మార్ఫింగ్ చేయడం పై ఎప్పటికప్పుడు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. స్పిరిట్ హీరోయిన్ ఎనర్జీ బూస్టర్ ఇదే... అయితే ఇప్పుడు మరొకసారి ఏఐ దుర్వినియోగంపై ఒక సుదీర్ఘ నోటు పంచుకుంది. ఎక్స్ వేదికగా రష్మిక షేర్ చేసిన ఈ పోస్ట్ వైరల్ అవ్వడమే కాకుండా ఏఐని దుర్వినియోగం చేస్తూ తన ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వదిలిన వారికి గట్టిగానే కౌంటర్ ఇచ్చింది.

మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం.. అధునాతన టెక్నాలజీ రోజుకూ పెరిగిపోతున్న నేపథ్యంలో ఈ టెక్నాలజీ మనిషికి ఉపయోగపడాలి కాని దుర్వినియోగం కాకూడదు. అయితే కొంతమంది ఈ ఏఐ రంగంలో అద్భుతాలు సృష్టిస్తుంటే మరికొంతమంది దీనిని తప్పు దోవలో ఉపయోగిస్తూ అటు సెలబ్రిటీలకు ఇటు సామాన్యులకు తీరని నష్టాన్ని మిగులుస్తున్నారు. ఇప్పటికే ఈ విషయంపై ఎంతోమంది సోషల్ మీడియా వేదికగా స్పందించడమే కాకుండా సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడం లేదా కోర్టును ఆశ్రయించడం లాంటివి చేశారు. అయితే ఇప్పుడు తాజాగా దీనిపై రష్మిక స్పందించింది. సమంతకు రాజ్ అదిరిపోయే గిఫ్ట్.. ఇకపై హైదరాబాద్ వస్తే.. రష్మిక తన ఎక్స్ ఖాతా ద్వారా.."మహిళలను లక్ష్యంగా చేసుకొని ఏఐని ఉపయోగిస్తూ టెక్నాలజీని దుర్వినియోగం చేస్తుండడం కొంతమంది వ్యక్తులలో నైతిక క్షీణతను సూచిస్తోంది. నిజానికి ఇంటర్నెట్ ప్రతిబింబం లాంటిది కాదని గుర్తుపెట్టుకోవాలి. ఏదైనా వక్రీకరించగలిగే కాన్వాస్ ఇది. గౌరవప్రదమైన మెరుగైన సమాజం కోసం మాత్రమే ఏఐ ను వినియోగిద్దాం. నిర్లక్ష్యాన్ని వదిలిపెట్టి బాధ్యతగా వ్యవహరిద్దాము. ఇక నిజాన్ని తయారు చేయగలిగినప్పుడే విచక్షణే మనకు గొప్ప రక్షణగా మారుతుంది" అంటూ సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ అసభ్యకరంగా ప్రవర్తించే వారిని ఉద్దేశిస్తూ రష్మిక ఈ పోస్ట్ పెట్టింది. %ూశ్రీంశ =ఝుు% - ఫంకీ రవితేజ అందుకే కాదన్నాడా..? ముఖ్యంగా ఇటువంటి వ్యక్తులపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా ఏఐ ను తప్పుదోవ పట్టిస్తూ వ్యక్తులకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిని.. మనుషుల్లాగా ప్రవర్తించని వారిని కఠినంగా శిక్షించాలి అంటూ డిమాండ్ చేసింది రష్మిక. ప్రస్తుతం రష్మిక షేర్ చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# అంతా దేవుడు దయ అనేసిన నటి!

ప్రణాళిక అన్నది అందరి విషయంలో ఒకేలా ఉండదు. కొందరి ప్రణాళిక సక్సెస్ అవుతుంది. మరికొంత మందిది ఫెయిల్ అవుతుంది. అందుకు కారణాలు అనేకం. కానీ దాని వెనుక దేవుడి రాత అన్నది ఒకటి రాసిపెట్టి ఉంటుందన్నది కొందరు నమ్మరు. మరికొంత మంది బలంగా విశ్వశిస్తారు. ఈ విషయంలో మలయాళ నటి సంయుక్తా మీనన్ తన కన్నా దేవుడినే ఎక్కువగా నమ్ముతానని చెప్పకనే చెప్పింది. కెరీర్ విషయంలో ఎన్నో ప్రణాళికలతో మొదలు పెడుతుంటాను. కానీ పరిణామాలు అందకు పూర్తి విరుద్దంగా సాగుతుంటాయంది - ట్రోలర్స్ కి రష్మిక కౌంటర్.. ఇప్పుడైనా? ముందు వెనకా అయిన చిత్రాలు బింబిసార విరూపాక్ష సార్ భీమ్లా నాయక్ చిత్రాలకు ఒకేసారి సంతకం చేసానంది. కానీ వాటి విడుదలలు మాత్రం అనుకున్న విధంగా జరగలేదంది. ముందు అనుకున్నది వెనక్కి వెళ్లింది. వెనుక అనుకున్నది ముందుగా రిలీజ్ అయింది. అదే తరహాలో ఇప్పుడు కూడా జరుగుతుందని తెలిపింది. స్వయంభూ నారీ నారీ నడుమ మురారీ అఖండ-2 తో పాటు పూరి జగన్నాద్ సినిమాలకు ఒకేసారి సంతకం చేసానంది. కానీ స్వయంభూ నారీ నారీ నడుమ మురారీ ఇప్పటికే విడుదలవ్వాలి. కానీ అలా జరగలేదు. వాటికంటే ముందే అఖండ 2 రిలీజ్ అవుతుంది. స్పిరిట్ హీరోయిన్ ఎనర్జీ బూస్టర్ ఇదే... 2026 లో ఆరేడు రిలీజ్ లు: ఇలా రిలీజ్ అన్నది ముందు..వెనుక అవ్వడంపై తానెప్పుడూ నిరుత్సాహపడలేదంది. నా ప్రణాళిక కంటే దేవుడి ప్రణాళికగా అవి రిలీజ్ అవుతున్నాయనిపిస్తుంది. ఇలా సాగడమే మేలు అని అనిపిస్తుంది. దైవాన్ని మించి ఏదీ లేదు. అలా జరిగితే సంతోషమే కదా? అని చెప్పుకొచ్చింది. ఏడాది ముగింపులో అఖండ 2 తో రాబోతుంది. ఈ ఏడాది రిలీజ్ అవుతున్న ఒకే చిత్రమిది. కానీ 2026 లో మాత్రం సంయుక్త మీనన్ నుంచి వరుస రిలీజ్ లు క నిపిస్తున్నాయి. దాదాపు ఆరేడు సినిమాలు రిలీజ్ కానున్నాయి. బాలీవుడ్ లో క్వీన్ ఆఫ్ క్వీన్స్ లో నటిస్తోంది. సమంతకు రాజ్ అదిరిపోయే గిఫ్ట్.. ఇకపై హైదరాబాద్ వస్తే.. ఆ వివరాల్లో మాత్రం గోప్యత: తెలుగులో స్వయంభూ నారీ నారీ నడుమ మురారీ, పూరి-విజయ్ సేతుపతి సినిమాల్లో నటిస్తోంది. మాలీవుడ్ లో రామ్, కోలీవుడ్ లో బెంజ్ లో నటిస్తోంది. ఆన్ సెట్స్ లో ఉన్న ఈ చిత్రాలన్నీ 2026లో రిలీజ్ అయ్యే చిత్రాలే. వీటిపై మంచి అంచనాలున్నాయి. 2024లో కూడా అమ్మడు హీరోయిన్ గా నటించిన సినిమా ఏదీ రిలీజ్ అవ్వలేదు. లవ్ మీ అనే చిత్రంలో గెస్ట్ అప్పిరియన్స్ తో అలరించింది. ఈ రెండేళ్లు గ్యాప్ ఇచ్చినా? కొత్త ఏడాది లో మాత్రం ఏడాదంతా సందడి చేయడం షురూ. అలాగే అమ్మడు మరికొన్ని కొత్త ప్రాజెక్ట్ లకు కమిట్ అయినట్లు ప్రచారం జరుగుతుంది. వాటి వివరాలు మాత్రం గోప్యంగా ఉంచింది.

# ఫంకీ రవితేజ అందుకే కాదన్నాడా..?

ఐతే ఫంకీ సినిమా సెట్స్ మీదకు వెళ్లే ముందు అనుదీప్ కెవి మాస్ మహరాజ్ రవితేజతో సినిమా చర్చ నడిచింది.




జాతిరత్నాలు సినిమాతో సూపర్ హిట్ అందుకున్న డైరెక్టర్ అనుదీప్ కెవి నెక్స్ట్ కోలీవుడ్ స్టార్ శివ కార్తికేయన్ తో ప్రిన్స్ సినిమా చేశాడు. ఆ సినిమా కూడా ఆడియన్స్ ని ఎంటర్టైన్ చేసింది. ఇక తన నెక్స్ట్ సినిమా ఫంకీతో వస్తున్నాడు అనుదీప్. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్ గా నటిస్తుంది. రీసెంట్ గా రిలీజైన ఫంకీ టీజర్ చూసిన ఆడియన్స్ మరోసారి అనుదీప్ మార్క్ ఎంటర్టైనర్ లోడింగ్ అనేస్తున్నారు. బాలీవుడ్ స్టార్ తో దిల్ రాజు.. బ్లాక్ బస్టర్ ప్లాన్..! అనుదీప్ కెవి మాస్ మహరాజ్ రవితేజతో సినిమా.. ఐతే ఫంకీ సినిమా సెట్స్ మీదకు వెళ్లే ముందు అనుదీప్ కెవి మాస్ మహరాజ్ రవితేజతో సినిమా చర్చ నడిచింది. ఐతే ఏమైందో ఏమో కానీ ఈ కాంబినేషన్ సినిమా పట్టాలెక్కలేదు. ఐతే రవితేజతో తీయాలనుకున్న ఆ సినిమానే విశ్వక్ సేన్ తో ఫంకీగా చేస్తున్నాడని ఇన్నర్ టాక్. ఫంకీ టీజర్ చూస్తే రవితేజ ఎందుకు ఈ సినిమా కాదనుకున్నాడా అన్న డిస్కషన్ మొదలైంది. ఐతే ఫంకీ సినిమాలో హీరో ఒక డైరెక్టర్ సో ఆల్రెడీ రవితేజ నేనింతే సినిమాలో డైరెక్టర్ గా చేశాడు. బహుశా అందుకే అనుదీప్ ఆఫర్ ని రిజెక్ట్ చేసి ఉండొచ్చని అంటున్నారు. ఐతే మరో పాయింట్ ఏంటంటే మాస్ జాతర కోసం రవితేజ అనుదీప్ ఫంకీ కాదనుకున్నాడని చెబుతున్నారు. ఐతే ఫంకీ ఇంకా రిలీజ్ కాలేదు టీజర్ కూడా ఆసక్తిగా ఉంది. కానీ రవితేజ మాస్ జాతర రిలీజై డిజాస్టర్ అనిపించుకుంది. ట్రోలర్స్ కి రష్మిక కౌంటర్.. ఇప్పుడైనా? రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమా,, సో రవితేజ ఫంకీ చేసి ఆ సినిమా చేయకుండా ఉండాల్సిందని ఫ్యాన్స్ అంటున్నారు. ఇంతకీ విశ్వక్ సేన్ ఫంకీ అనుదీప్ నిజంగానే రవితేజతో చేయాలని అనుకున్నాడా లేదా మరో కథతో రవితేజతో అప్రోచ్ అయ్యాడా అన్నది తెలియాల్సి ఉంది. ఒకవేళ రవితేజతో అనుదీప్ వేరే కథ చెప్పి ఉంటే మాత్రం ఫంకీ తర్వాత రవితేజకు అనుదీప్ మంచి ఆప్షన్ అని చెప్పొచ్చు. ప్రస్తుతం భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమా చేస్తున్నాడు రవితేజ. ఈ సినిమా తర్వాత శివ నిర్వాణ డైరెక్షన్ లో సినిమాకు రెడీ అవుతున్నాడు. స్పిరిట్ హీరోయిన్ ఎనర్జీ బూస్టర్ ఇదే... కాస్త లేట్ అయినా కూడా రవితేజ ఎనర్జీకి అనుదీప్ మార్క్ కామెడీ సినిమా ఒకటి పడితే చూడాలని తెలుగు ఆడియన్స్ ఆశిస్తున్నారు. ఈ కాంబో సెట్ అయితే మాత్రం ఫుల్ ఆన్ ఎంటర్టైనర్ మూవీ ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. రవితేజ కూడా వరుస ఫ్లాపులతో కాస్త డిజప్పాయింట్ తో ఉన్నాడు. అందుకే హిట్ ఇచ్చే డైరెక్టర్ వేటలో పడ్డాడు మాస్ రాజా. ఫంకీ హిట్ పడితే మాత్రం తప్పకుండా రవితేజ, అనుదీప్ కాంబో కుదిరే అవకాశం ఉంటుందని చెప్పొచ్చు.



# 'అఖండ 2' సెన్సార్ పూర్తి.. రన్ టైమ్ లాక్, రిపోర్ట్ ఎలా ఉందంటే?

లేటెస్ట్ గా అందిన సమాచారం ప్రకారం, ఈ సినిమాకు సెన్సార్ బోర్డ్ సర్టిఫికెట్ జారీ చేసింది.



నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్ అంటే బాక్సాఫీస్ దగ్గర మినిమమ్ గ్యారెంటీ అనే పేరుంది. 'అఖండ' తర్వాత వీరిద్దరూ కలిసి చేస్తున్న 'అఖండ 2: తాండవం' సినిమా విడుదలకు సిద్ధమైంది. డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమాకు సంబంధించిన సెన్సార్ కార్యక్రమాలు తాజాగా పూర్తయ్యాయి. సెన్సార్ సభ్యుల నుంచి సినిమాకు ఎలాంటి రెస్పాన్స్ వచ్చింది, రన్ టైమ్ ఎంత లాక్ చేశారనే విషయాలపై ఇప్పుడు క్లారిటీ వచ్చింది. బాలీవుడ్ స్టార్ తో దిల్ రాజు.. బ్లాక్ బస్టర్ ప్లాన్..! లేటెస్ట్ గా అందిన సమాచారం ప్రకారం, ఈ సినిమాకు సెన్సార్ బోర్డ్ '%ఖ/ూ%' సర్టిఫికెట్ జారీ చేసింది. ఇక సినిమా నిడివి విషయానికి వస్తే, 2 గంటల 45 నిమిషాల రన్ టైమ్ ను లాక్ చేశారు. సాధారణంగా భారీ కమర్షియల్ సినిమాలకు ఈ మాత్రం నిడివి ఉండటం సహజమే. అయితే ఈసారి ఆడియెన్స్ ను ఎంగేజ్ చేసేలా ఉందా లేదా అనేదే ముఖ్యం. సెన్సార్ సభ్యుల నుంచి మాత్రం సినిమా పట్ల సానుకూల స్పందన వచ్చినట్లు తెలుస్తోంది. సినిమాలో ప్రధానంగా యాక్షన్ ఎపిసోడ్స్ హైలైట్ గా నిలుస్తాయని రిపోర్ట్స్ చెబుతున్నాయి. సనాతన ధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పే సన్నివేశాలు, దానికి సంబంధించిన డైలాగులు బాలయ్య మార్క్ లో ఉంటాయట. మొదటి పార్ట్ తో పోలిస్తే, ఇందులో చూపించే ప్రపంచం, విజువల్స్ కొంచెం కొత్తగా, ఫ్రెష్ గా ఉంటాయని టాక్ వినిపిస్తోంది. ట్రోలర్స్ కి రష్మిక కౌంటర్.. ఇప్పుడైనా? దర్శకుడు బోయపాటి శ్రీను కథ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటూనే, బాలకృష్ణ అఘోరా పాత్రను మరో మెట్టు ఎక్కించేలా డిజైన్ చేశారని అంటున్నారు. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా, మదర్ సెంటిమెంట్, శివుడికి సంబంధించిన అంశాలు కథలో అంతర్లీనంగా సాగుతాయని సమాచారం. బాలయ్య స్క్రీన్ ప్రెజెన్స్, డైలాగ్ డెలివరీ ఫ్యాన్స్ కోరుకునే విధంగానే ఉండబోతోందట. సెన్సార్ పూర్తయిన తర్వాత అధికారుల నుంచి టీమ్ కు అభినందనలు దక్కాయని, అన్ని భాషల్లోనూ ఇదే రకమైన రెస్పాన్స్ ఆశిస్తున్నామని నిర్మాతలు భావిస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో ప్రీమియర్స్ లాక్ అయ్యాయి. ఆంధ్రప్రదేశ్ లో బుకింగ్స్ ఓపెన్ అవ్వగా, బుక్ మై షోలో సినిమా ట్రెండింగ్ లో ఉంది. బయట వినిపిస్తున్న సెన్సార్ టాక్ డీసెంట్ గానే ఉన్నా, అసలు ఫలితం ఎలా ఉంటుందో తెలియాలంటే డిసెంబర్ 5 వరకు ఆగాల్సిందే. మొత్తానికి ఎలాంటి కట్స్, ఇబ్బందులు లేకుండా 'అఖండ 2' రిలీజ్ కు లైన్ క్లియర్ అయ్యింది.

Printed, Published, Owend by Neeruganti Shashikala& Printed at Sreenivasa Offset Printers D.No 12-73-A, Sai Nagar, Anantapur (Dt) APTEL/RNI NO/2021/81405 & Published at D. NO. 12-73-A, Sai Nagar. Anantapur. ANANTAPUR (Dt).(A.P) Editior Neeruganti Shashikala Cell: 6303427710